# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 66, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం -24 - మే - 2025


## బంగ్లాదేశ్‌లో రాజకీయ వేడి.. రాజీనామాకు సిద్ధపడ్డ మహమ్మద్ యూనస్

●బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ రాజీనామా యోచన



●పార్టీల నుంచి పూర్తి మద్దతు లభించకపోతే పదవి నుంచి తప్పుకుంటానని హెచ్చరిక

●డిసెంబర్ కల్లా ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసిన ఆర్మీ చీఫ్

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శుభవార్త

●తగ్గిన ఛార్జీలు నేటి నుంచి అమలు



●కనీస ఛార్జీ రూ.11, గరిష్ఠ ఛార్జీ రూ.69గా నిర్ణయం

●రెండు కిలోమీటర్ల వరకు రూ.12 నుంచి రూ.11కి తగ్గింపు

●వివిధ దూరాలకు అనుగుణంగా ఛార్జీలు సవరించిన మెట్రో సంస్థ

## కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు?: సుప్రీంకోర్టు సూటి ప్రశ్న

కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన



రాజస్థాన్ ప్రభుత్వ వైఖరిపై జస్టిస్ పర్దీవాలా తీవ్ర అసంతృప్తి

ఈ ఏడాది కోటాలో ఇప్పటికే 14 మంది విద్యార్థుల బలవన్మరణం

ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థి మృతి కేసులో ఎఫ్ఐఆర్ ఆలస్యంపై ఆగ్రహం



## 'స్కామ్‌స్టర్ బాబు'.. హ్యాష్ ట్యాగ్‌తో వైఎస్ జగన్ ట్వీట్

●దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆధారాలతో సహా వివరాలను ట్యాగ్ చేశారు

● మద్యం స్కాంలోని వాస్తవాలతోపాటు పూర్తి సమాచారాన్ని తెలిపారు

●యథేచ్ఛగా సాగుతున్న రాజకీయ వేధింపులు, అధికార దుర్వినియోగంపై ఆధారాలను బహిర్గతం చేశారు.

● ప్రభుత్వ అధికారులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాలపై పెరిగిన కక్షసాధింపుల గురించి చర్చించారు

## కేంద్ర మంత్రి రాజ్ నాథ్ తో నా సమావేశం

# అద్భుతంగా సాగింది

- ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- భారత రక్షణ, ఏరోస్పేస్ రంగంలో ఏపీని కీలక కేంద్రంగా మార్చే ప్రణాళికపై చర్చ
- థీమాటిక్ డిఫెన్స్ హబ్‌లు, డీఆర్‌డీఓ అనుబంధ కేంద్రాలపై ప్రతిపాదన
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు ఏపీ కట్టుబడి ఉందని వెల్లడి
- కేంద్ర మంత్రి సానుకూల స్పందన, పూర్తి మద్దతుపై చంద్రబాబు హర్షం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను భారత రక్షణ, ఏరోస్పేస్ రంగాల భవిష్యత్తుకు ఒక మూలస్తంభంగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో, ఆయన నేడు ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ముఖ్యంగా రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళికపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన సమావేశం అద్భుతంగా, ఫలవంతంగా సాగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. భారతదేశాన్ని రక్షణ రంగంలో స్వావలంబన దిశగా నడిపించే 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం మిగతా..2లో

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో చంద్రబాబు భేటీ

రాష్ట్రానికి రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యం కేటాయించాలని విజ్ఞప్తి

సమావేశం ఫలప్రదమైందని ఏపీ ముఖ్యమంత్రి ట్వీట్



ఏపీలోని ప్రతి నియోజకవర్గంలో 10,000 రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యమని ప్రకటన

## ఆపరేషన్ సిందూర్, ప్రధాని మోదీపై ముఖేశ్ అంబానీ వ్యాఖ్యలు




★ప్రధాని మోదీ నాయకత్వంపై ముకేశ్ అంబానీ ప్రశంసలు

★భద్రతా దళాల ధైర్యసాహసాలను కొనియాడిన రిలయన్స్ అధినేత

★'ఆపరేషన్ సిందూర్' విజయం గొప్ప నిదర్శనమన్న అంబానీ

★ఢిల్లీలో 'రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సు'లో వ్యాఖ్యలు

★ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్, అష్టలక్ష్మి వంటిదని మోదీ అభివర్ణన

★ఉగ్రవాదంపై భారత్ దృఢ సంకల్పాన్ని గతంలోనూ మెచ్చిన అంబానీ

ఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ దక్షతను, భారత భద్రతా దళాల అసమాన ధైర్యసాహసాలను కొనియాడారు. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' విజయం ఈ రెండింటికీ నిలువెత్తు నిదర్శనమని ఆయన ప్రశంసించారు. మిగతా..2లో

## మోదీపై రాహుల్ ఘాటు విమర్శలు..

# జైశంకర్‌కు కొత్త పేరు



రాహుల్ కామెంట్స్‌పై బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా విమర్శలు

ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ విదేశాంగ విధానం కుప్పకూలింది

ఉగ్రవాదంపై పాకిస్తాన్ ప్రకటనను ఎందుకు నమ్మారు?

ఢిల్లీ: కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. మిగతా..2లో

## టీటీడీ 'డయల్ యువర్ ఈవో' మే 24న.. భక్తులు నేరుగా ఈవోతో మాట్లాడే అవకాశం

మే 24, 2025న తిరుమలలో 'డయల్ యువర్ ఈవో'



ఉదయం 9 నుండి 10 గంటల వరకు కార్యక్రమం


భక్తులు నేరుగా ఈవోతో ఫోన్‌లో మాట్లాడి సూచనలు, సలహాలు ఇవ్వొచ్చని తెలిపిన పీఆర్వో

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 0877-2263261

## ఎన్నిసార్లైనా ప్రధానిని కలుస్తా..

# నిధులు తెస్తా

- అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తా
- మెదక్ అంటే ఇందిరమ్మ.. ఇందిరమ్మ అంటే మెదక్
- ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుంది
- జహీరాబాద్ నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- "పటాన్‌చెరు ప్రాంతం మినీ ఇండియాలాంటిది



సంగారెడ్డి: మెదక్ అంటే ఇందిరమ్మ.. ఇందిరమ్మ అంటే మెదక్ అని, ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పస్తాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ నిలవాలని కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నారాయణ్‌ఖేడ్ అభివృద్ధికి ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. మిగతా..2లో






## మనకు ఇంకా రెండు ఎస్-400లు రావాలి..

● రష్యా వెళుతున్న అజిత్ దోవల్

●ఎస్-400 క్షిపణి వ్యవస్థల ముందస్తు డెలివరీపై చర్చలు

●మాస్కోలో అంతర్జాతీయ భద్రతా సమావేశంలో పాల్గొనే అవకాశం

●ఇప్పటికే మూడు ఎస్-400 వ్యవస్థలు భారత్‌కు అందజేత

ఢిల్లీ: భారత గగనతల రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. అత్యాధునిక ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థల మిగిలిన యూనిట్ల డెలివరీని వేగవంతం చేసే విషయమై చర్చించేందుకు భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వచ్చే వారం రష్యాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో ఆయన రష్యా ఉన్నతాధికారులతో భేటీ కానున్నారు. మే 27 నుంచి 29 వరకు మాస్కోలో జరగనున్న భద్రతా వ్యవహారాల మిగతా..2లో

## 'ఓటీటీ ఫ్యామిలీ డ్రామాలా కవిత లేఖ'



● కవిత లేఖ 'కాంగ్రెస్ వదిలిన బాణం' అనే 'ఓటీటీ ఫ్యామిలీ డ్రామా

● తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం

● కుటుంబ పార్టీ రాజకీయాలకు బీజేపీ వ్యతిరేకం

● కుటుంబ పార్టీ వాటి సొంత సంక్షోభాన్ని ప్రజల ఎమోషన్లుగా మార్చాలని చూస్తోంది

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌ను కార్నర్ చేసి.. బీజేపీ, కాంగ్రెస్‌లు పోటాపోటీగా విమర్శలు గుప్పిస్తున్నాయి. మిగతా..2లో

## కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు?: సుప్రీంకోర్టు సూటి ప్రశ్న

ఢిల్లీ: రాజస్థాన్‌లోని కోచింగ్ హబ్ అయిన కోటా నగరంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పరిస్థితిని 'తీవ్రమైనది'గా అభివర్ణించింది. ఈ ఏడాది కోటాలో ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడటం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ధర్మాసనం శుక్రవారం ఈ అంశాన్ని విచారించింది. "ఒక రాష్ట్రంగా మీరేం చేస్తున్నారు? కేవలం కోటాలోనే ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? దీని గురించి రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించలేదా?" అంటూ జస్టిస్ పర్దీవాలా రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది, ఆత్మహత్యల ఘటనలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే, విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి జాతీయ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని మార్చి 24న ఇచ్చిన తీర్పును ధర్మాసనం గుర్తుచేసింది. సిట్ నివేదికకు సమయం పడుతుందని, ఆలోగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండరాదని హితవు పలికింది. ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రెండు కేసులను పరిశీలించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థి మృతి కేసులో ఎఫ్ఐఆర్ నమోదులో నాలుగు రోజుల జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "ఇలాంటి విషయాలను తేలిగ్గా తీసుకోవద్దు. సంబంధిత పోలీస్ అధికారిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకునేవాళ్లం" అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఎఫ్ఐఆర్ నమోదై దర్యాప్తు జరుగుతుండటంతో, దర్యాప్తు వేగంగా, సరైన దిశలో సాగాలని సూచించింది. కోటాలో నీట్ ఆశావహ విద్యార్థిని ఆత్మహత్య కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీరు మా తీర్పును ధిక్కరిస్తున్నారు. ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు?" అని ప్రభుత్వాన్ని నిలదీసింది. విద్యార్థిని తల్లిదండ్రులతో ఉన్నా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయడం పోలీసుల విధి అని, ఈ విషయంలో సంబంధిత పోలీస్ అధికారి విఫలమయ్యారని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వైఫల్యంపై వివరణకు, జూలై 14న తమ ముందు హాజరుకావాలని కోటాకు చెందిన సంబంధిత పోలీసు అధికారిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిర్లక్ష్యాన్ని వీడి, విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు తక్షణ పటిష్ఠ చర్యలు చేపట్టాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం రాజస్థాన్ ప్రభుత్వానికి కఠిన ఆదేశాలిచ్చింది.

## టీటీడీ 'డయల్ యువర్ ఈవో' మే 24న.. భక్తులు నేరుగా ఈవోతో మాట్లాడే అవకాశం

తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తులతో నేరుగా మాట్లాడేందుకు మరోమారు వేదికను సిద్ధం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తమ అభిప్రాయాలను, సలహాలను, సమస్యలను నేరుగా టీటీడీ కార్యనిర్వహణాధికారి (ఈవో) దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేసిన 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం మే 24, 2025న జరగనుంది. ఈ కార్యక్రమం మే 24వ తేదీ, శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహిస్తారు. టీటీడీ ఈవో జె. శ్యామలరావు ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, భక్తుల నుండి ఫోన్ ద్వారా అందే సూచనలను, అభిప్రాయాలను స్వీకరిస్తారు. టీటీడీ సేవలు, యాత్రికుల సౌకర్యాలు, ఇతర నిర్వహణాపరమైన అంశాలపై భక్తులు తమ అమూల్యమైన సలహాలను ఈవోకు నేరుగా తెలియజేయవచ్చు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు 0877-2263261 అనే టెలిఫోన్ నంబర్‌కు డయల్ చేసి తమ అభిప్రాయాలను పంచుకోవచ్చు. ఈ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు కార్యక్రమాన్ని వీక్షించడంతో పాటు, తమ సూచనలను తెలియజేసేందుకు వీలు కలుగుతుందని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## జనావాసాలపై కూలిన విమానం.. అమెరికాలో భారీ విధ్వంసం..!

అమెరికా: అమెరికాలో గురువారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. దక్షిణ కాలిఫోర్నియాలోని శాన్ డియాగోలో ఓ చిన్న విమానం అదుపుతప్పి జనావాసాలపై పడింది. దీంతో మంటలు ఎగిసిపడి 15 ఇళ్లు, పదుల సంఖ్యలో కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని స్థానిక అధికారులు వెల్లడించారు. నగర శివార్లలోని స్కల్పిన్ స్ట్రీట్, శాంటో రోడ్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, ప్రజలెవరూ అటువైపు రాకుండా హెచ్చరికలు జారీ చేశారు. ప్రమాదానికి గురైన విమానం సెస్నా రకానికి చెందినదిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో పైలట్ సహా ఇద్దరు మరణించారని, జనావాసాలపై విమానం కూలినందున మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. విమాన శకలాలు చెల్లాచెదురుగా పడిపోయాయని శాన్ డియాగో అగ్నిమాపక శాఖ సహాయ ప్రధాన అధికారి ఏబీసీ న్యూస్‌కు తెలిపారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శుభవార్త

హైదరాబాద్ : హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా మెట్రో రైళ్లలో నిత్యం ప్రయాణించేవారికి ఒక శుభవార్త. హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలను తగ్గిస్తున్నట్లు యాజమాన్యం ఇదివరకే ప్రకటించింది. ఈ సవరించిన, తగ్గిన ఛార్జీలు శనివారం నుండి అమల్లోకి రానున్నాయి. దీనితో ప్రయాణికులపై కొంత ఆర్థిక భారం తగ్గనుంది. ఇటీవల హైదరాబాద్ మెట్రో ఛార్జీలను పెంచిన విషయం తెలిసిందే. అయితే, ఆ తర్వాత ఆ నిర్ణయాన్ని సవరిస్తూ ఛార్జీలను తగ్గించారు. కొత్తగా సవరించిన ధరల ప్రకారం, మెట్రోలో ప్రయాణానికి కనీస ఛార్జీ రూ.11గానూ, గరిష్ఠ ఛార్జీ రూ.69గానూ నిర్ధారించారు.

వివిధ దూరాలకు అనుగుణంగా ఛార్జీల తగ్గింపు వివరాలు ఇలా ఉన్నాయి:

– రెండు కిలోమీటర్ల వరకు ప్రయాణానికి ఇంతకుముందు ఉన్న రూ.12 ఛార్జీని రూ.11కి తగ్గించారు. రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరానికి రూ.18 నుండి రూ.17కి ఛార్జీ తగ్గింది. నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల ప్రయాణానికి రూ.30 బదులుగా రూ.28 చెల్లిస్తే సరిపోతుంది. ఆరు నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరానికి ఛార్జీని రూ.40 నుండి రూ.37కి సవరించారు. తొమ్మిది నుంచి పన్నెండు కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తే, రూ.50 స్థానంలో రూ.47 చెల్లించాలి. పన్నెండు నుంచి పదిహేను కిలోమీటర్ల దూరానికి ఛార్జీ రూ.55 నుంచి రూ.51కి తగ్గింది. పదిహేను నుంచి పద్దెనిమిది కిలోమీటర్లకు రూ.60 బదులు రూ.56 వసూలు చేస్తారు. పద్దెనిమిది నుంచి ఇరవై ఒక్క కిలోమీటర్ల ప్రయాణానికి రూ.66 నుంచి రూ.61కి ఛార్జీని తగ్గించారు. ఇరవై ఒకటి నుంచి ఇరవై నాలుగు కిలోమీటర్ల వరకు రూ.70కి బదులుగా రూ.65 చెల్లించాలి. ఇరవై నాలుగు కిలోమీటర్లకు పైబడిన దూరానికి ప్రయాణిస్తే, గరిష్ఠ ఛార్జీ రూ.75 నుంచి రూ.69కి తగ్గించారు.

## 'స్కామ్‌స్టర్ బాబు'.. హ్యాష్ ట్యాగ్‌తో వైఎస్ జగన్ ట్వీట్

తాడేపల్లి: ఏపీలో చంద్రబాబు సర్కార్ పాలనలో జరుగుతున్న కుంభకోణాలను, కుట్రలను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆధారాలతో సహా బయటపెట్టారు. వైఎస్ జగన్ గురువారం మీడియా సమావేశంలో అన్ని విషయాలను వివరించారు. ఆపై స్కామ్ స్టర్ బాబు' అంటూ హ్యాష్ ట్యాగ్‌తో చంద్రబాబు అక్రమాలు, అవినీతి, స్కాంల ఆధారాలను వైఎస్ జగన్ ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా ట్విట్టర్ వేదికగా చంద్రబాబు అక్రమాలను మరోసారి వివరించారు. ఈ సందర్భంగా.. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆధారాలతో సహా వివరాలను ట్యాగ్ చేశారు. మద్యం స్కాంలోని వాస్తవాలతోపాటు పూర్తి సమాచారాన్ని తెలిపారు. కేసులోని అబద్ధాలు, కట్టు కథలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న రెడ్ బుక్ రాజ్యాంగం తీరు, ప్రజా వ్యతిరేకతపై ప్రశ్నించే గొంతులను నులుమేస్తున్న తీరుపై మాట్లాడారు. యథేచ్ఛగా సాగుతున్న రాజకీయ వేధింపులు, అధికార దుర్వినియోగంపై ఆధారాలను బహిర్గతం చేశారు. ప్రభుత్వ అధికారులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాలపై పెరిగిన కక్షసాధింపుల గురించి చర్చించారు. వీటికి సంబంధించిన వివరణాత్మక ఆధారాలను ట్వీట్‌లో జత చేసినట్టు తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో రాజకీయ వేడి.. రాజీనామాకు సిద్ధపడ్డ మహమ్మద్ యూనస్



బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత, నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ తాను పదవి నుంచి వైదొలగనున్నట్లు సంకేతాలిచ్చారు. అన్ని పార్టీలు తనకు పూర్తి మద్దతు ఇవ్వని పక్షంలో రాజీనామా చేస్తానని హెచ్చరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్-ఉజ్-జమాన్ డిసెంబర్ నాటికి ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేయడం, మరోవైపు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఎన్నికల నిర్వహణకు స్పష్టమైన ప్రణాళిక కోరుతూ ఆందోళనలు ఉధృతం చేసిన నేపథ్యంలో యూనస్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా రాజకీయ పరిణామాలు, నిరసనల మధ్య తాను పనిచేయలేకపోతున్నానని యూనస్ ఆవేదన వ్యక్తం చేసినట్లు నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) నేత నహీద్ ఇస్లాం బీబీసీ బంగ్లాకు తెలిపారు. "నన్ను బందీగా పట్టుకున్నట్లుంది. ఇలా పనిచేయలేను. రాజకీయ పార్టీలన్నీ ఒక ఉమ్మడి అవగాహనకు రాలేవా?" అని యూనస్ తనతో అన్నట్లు నహీద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహం 'జమున'లో యూనస్‌తో జరిగిన సమావేశంలో తాను కూడా ఉన్నానని, పదవిలో కొనసాగాలని నహీద్ ఆయన్ను కోరారని మరో ఎన్‌సీపీ నేత ఆరిఫుల్ ఇస్లాం అదీబ్ ఏఎఫ్‌పీ వార్తా సంస్థకు తెలిపారు. యూనస్ రాజీనామా చేయాలనుకున్నారని, అయితే కేబినెట్ సభ్యులు నచ్చజెప్పడంతో ప్రస్తుతానికి విరమించుకున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి. మరోవైపు, యూనస్ రాజీనామా బెదిరింపు వెనుక ఓ వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా యూనస్ పదవీకాలం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్మీ చీఫ్ ఎన్నికల డిమాండ్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు, ఇస్లామిస్ట్ గ్రూపులతో కొత్త ఆందోళనలు సృష్టించేందుకే యూనస్ ఈ ఎత్తుగడ వేశారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ప్రార్థనల అనంతరం సైనిక కేంద్రం వైపు భారీ ప్రదర్శనలకు విద్యార్థి నాయకులు పిలుపునిచ్చినట్లు సమాచారం. ఇప్పటికే షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై నిషేధం ఉండటంతో, బీఎన్‌పీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావాలని చూస్తోంది. ఎన్నికలు ఆలస్యమైతే తమ అవకాశాలు దెబ్బతింటాయని బీఎన్‌పీ ఆందోళన చెందుతోంది. రాబోయే కొద్ది రోజులు బంగ్లాదేశ్ రాజకీయాలకు అత్యంత కీలకమని పరిశీలకులు భావిస్తున్నారు.

# ఎన్నిసార్లైనా ప్రధానిని కలుస్తా.. నిధులు తెస్తా



మొదటి పేజి తరువాయి

నారాయణ్‌ఖేడ్ అభివృద్ధికి ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. "పటాన్‌చెరు ప్రాంతం మినీ ఇండియాలాంటిది. ఈ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రధానిగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగింది. సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా అమలు చేశాం. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం. అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేసేలా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర సాయం తీసుకుంటాం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధిని సాధించగలం. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తా. ఎవరేం అనుకున్నా నాకు ఇబ్బంది లేదు. చక్కెర పరిశ్రమ కోసం సహకార సంఘం ఏర్పాటు చేసుకుంటే.. నిమ్జ్‌లో 100 ఎకరాలు కేటాయించడంతోపాటు నిధులు కూడా మంజూరు చేయిస్తా" అని సీఎం అన్నారు.

### ఎన్నిసార్లైనా ప్రధానిని కలుస్తా.. నిధులు తెస్తా

ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని అన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి . తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఎన్నిసార్లైనా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి అ న్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు (శుక్రవారం) జహీరాబాద్ హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆపై కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జహీరాబాద్ పారిశ్రామికవాడ భూసేకరణలో అన్యాయం జరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పెంచామని.. జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని... నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. మెదక్ జిల్లా పేరు చెబితేనే ఇందిరమ్మ గుర్తొస్తుంది అని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ ప్రజలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటుందన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేశామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష చేస్తామన్నారు. భవిష్యత్‌లోనూ మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్, ప్రధాని మోదీపై ముఖేశ్ అంబానీ వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి



దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'రైజింగ్ నార్త్ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సు'లో మాట్లాడుతూ అంబానీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ కూడా హాజరయ్యారు. ఢిల్లీలో రెండు రోజుల పాటు 'రైజింగ్ నార్త్ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సు' జరుగుతోంది. ఈశాన్య రాష్ట్రాలలో పెట్టుబడులను ఆకర్షించి, ఆ ప్రాంత అభివృద్ధికి ఊతమివ్వడమే ఈ సదస్సు యొక్క ప్రధాన లక్ష్యం. ప్రధాని నరేంద్ర మోదీ ఈ సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే మన దేశంలో, ఈశాన్య ప్రాంతం మరింత ప్రత్యేకమైన వైవిధ్యతను కలిగి ఉందని అన్నారు. ఈశాన్య భారతాన్ని ఒక 'పవర్‌హౌస్'గా, దేశానికి 'అష్టలక్ష్మి' వంటిదని ఆయన అభివర్ణించారు. ఇదే సదస్సులో పాల్గొన్న ముకేశ్ అంబానీ, ప్రధాని మోదీ నాయకత్వ పటిమకు సెల్యూట్ చేస్తున్నానని పేర్కొన్నారు. అలాగే, దేశ భద్రత కోసం అహర్నిశలు పాటుపడుతున్న భద్రతా బలగాల సాహసోపేత చర్యలను ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్'పై ముకేశ్ అంబానీ గతంలోనూ స్పందించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ ఐక్యంగా, స్థిరంగా, దృఢ సంకల్పంతో పోరాడుతోందని ఆయన అన్నారు. మన సాయుధ దళాల శౌర్యపరాక్రమాలను చూసి గర్వపడుతున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. "ప్రధాని మోదీ నాయకత్వంలో, భారత బలగాలు సరిహద్దు అవతల ఉన్న ఉగ్రవాద కార్యకలాపాలపై అత్యంత కచ్చితత్వంతో స్పందించాయి. ఉగ్రవాదం విషయంలో భారత్ ఎన్నటికీ మౌనంగా ఉండబోదని, దేశంపై, పౌరులపై, సైన్యంపై జరిగే దాడులను ఎంతమాత్రం సహించబోదని మోదీ నాయకత్వం నిరూపించింది. శాంతికి భంగం కలిగించే ఎలాంటి ముప్పునైనా దీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేసింది" అని అంబానీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మోదీపై రాహుల్ ఘాటు విమర్శలు.. జైశంకర్‌కు కొత్త పేరు

మొదటి పేజి తరువాయి



ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ విదేశాంగ విధానం కుప్పకూలిందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో ప్రధాని మోదీపై ఆపరేషన్ సిందూర్‌పై ప్రధాని మోదీకి పలు ప్రశ్నలు సంధించారు. ఉగ్రవాదంపై పాకిస్తాన్ ప్రకటనను ఎందుకు నమ్మారు?.కెమెరాల ముందు మాత్రమే మీ రక్తం ఎందుకు మరుగుతోంది. భారత దేశ గౌరవం విషయంలో మీరు ఎందుకు రాజీ పడ్డారు. పహల్గాం ఉగ్రదాడిపై భారత్‌కు మద్దతిస్తూ.. పాకిస్తాన్‌ను ఏ ఒక్క దేశం ఎందుకు ప్రశ్నించలేదు. భారత్-పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం వహించమని ట్రంప్‌ను ఎవరు అడిగారు?' అని నొక్కాణించారు. ఈ సందర్భంగా దేశ విదేశాంగ విధానం కుప్పకూలిందని ఆరోపిస్తూ ఆ శాఖను నిర్వర్తిస్తున్న కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జై శంకర్‌కు రాహుల్ కొత్త పేరు పెట్టారు. జైశంకర్ కాదని..జైచంద్ జైశంకర్ అని విమర్శించారు. జై శంకర్ అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన వీడియోను ట్యాగ్ చేస్తూ.. తాను పైన అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిణామలపై కాంగ్రెస్ నేతలు కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌ను జైచంద్ జైశంకర్ అని సంబోధిస్తూ విమర్శిస్తున్నారు.దీంతో జైచంద్ జైశంకర్ పేరు ఎందుకు పెట్టారా అని పలువురు నెటిజన్లు ఆరాతీస్తున్నారు. ప్రముఖ కవి పృథ్వీరాజ్ రాసో రాసిన ఓ కవిత నుంచి ఈ పేరును తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ కవితలో రాజ్‌పుత్ పాలకుడు జైచంద్, మరొక రాజ్‌పుత్ పాలకుడు పృథ్వీరాజ్ చౌహాన్‌కు వ్యతిరేకంగా ముహమ్మద్ ఘోరీతో పొత్తు పెట్టుకున్నట్లు చెప్పబడింది.

రాహుల్‌పై బీజేపీ విమర్శలు

అయితే, రాహుల్ కామెంట్స్‌పై బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా విమర్శలు గుప్పించారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆయన నిర్లక్ష్య ప్రకటనలు చేశారు. ఆ ప్రకటనతో రాహుల్ గాంధీ స్వభావం ఎలాంటిదో చెబుతోంది. రాహుల్ గాంధీకి ప్రధాని మోదీ అంటే పడకపోవచ్చు. కానీ రాహుల్ గాంధీ ప్రధానమంత్రిపై ఉపయోగించిన భాష దురదృష్టకరం' అని మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్ ఎంత విజయవంతమైందో మనందరికీ తెలుసు. ప్రతి భారతీయుడు దాని గురించి గర్వపడుతున్నాడు.ప్రపంచం మొత్తం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని అభినందిస్తోంది. మన ధైర్య సాయుధ దళాలను ప్రపంచవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు. ఉగ్రవాదులను మాత్రమే కాకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలించేలా ఆపరేషన్ సిందూర్‌తో సంకేతం పంపించామని' భాటియా సూచించారు.

## 'ఓటీటీ ఫ్యామిలీ డ్రామాలా కవిత లేఖ'

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌ను కార్నర్ చేసి.. బీజేపీ, కాంగ్రెస్‌లు పోటాపోటీగా విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో అంశంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కవిత లేఖ 'కాంగ్రెస్ వదిలిన బాణం' అనే 'ఓటీటీ ఫ్యామిలీ డ్రామా. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం. కుటుంబ పార్టీ రాజకీయాలకు బీజేపీ వ్యతిరేకం. కుటుంబ పార్టీ వాటి సొంత సంక్షోభాన్ని ప్రజల ఎమోషన్లుగా మార్చాలని చూస్తోంది. కానీ, తెలంగాణ ప్రజలు ఈ లేఖ డ్రామాని పట్టించుకోవడం లేదు. బీజేపీ ఎవరినీ జైలుకు పంపదు. చట్టం ఆ పని చేస్తుంది. తప్పు చేసినవారు చట్టం నుంచి తప్పించుకోలేరు. తెలంగాణలో ప్రతీ సర్వే బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని చెబుతోంది. అధికారం.. ఆర్భాటాలు లేకున్నా బీజేపీని ప్రజలు నమ్ముతున్నారు. వాళ్లు కోరుకునేది అభివృద్ధి.. నిజమైన మార్పు. అంతేగానీ పొలిటికల్ ఫ్యామిలీ డ్రామాలు కాదు. నిజమైన మార్పు బీజేపీ తోనే సాధ్యమని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు" అని ట్వీట్ చేశారాయన.

## మనకు ఇంకా రెండు ఎస్-400లు రావాలి..

మొదటి పేజి తరువాయి

మే 27 నుంచి 29 వరకు మాస్కోలో జరగనున్న భద్రతా వ్యవహారాల ఉన్నతస్థాయి ప్రతినిధుల 13వ అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు దోవల్ అధికారికంగా వెళుతున్నప్పటికీ, ఈ పర్యటనలో ప్రధానంగా ఎస్-400 డెలివరీల అంశంపైనే దృష్టి సారించనున్నారని పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఇటీవల భారత్-పాకిస్థాన్ మధ్య చోటుచేసుకున్న 'ఆపరేషన్ సిందూర్' ఘటనల నేపథ్యంలో, ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఆ సమయంలో భారత ఎస్-400 వ్యవస్థలు పాకిస్థాన్ వైమానిక దాడుల యత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టడంలో కీలక పాత్ర పోషించినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. రష్యాకు చెందిన ఎన్‌పీవో అల్మాజ్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ శక్తివంతమైన క్షిపణి వ్యవస్థల కొనుగోలు కోసం భారత్, రష్యాల మధ్య 2018లో సుమారు రూ.35 వేల కోట్ల విలువైన ఒప్పందం కుదిరింది. మొత్తం ఐదు ఎస్-400 ట్రయంఫ్ వ్యవస్థల కోసం ఈ ఒప్పందం జరిగింది. వీటిలో ఇప్పటికే మూడు వ్యవస్థలు భారత్‌కు చేరాయి. మిగిలిన రెండు వ్యవస్థల డెలివరీ రష్యా-ఉక్రెయిన్ యుద్ధంగా కారణంగా ఆలస్యం అయింది. షెడ్యూల్ ప్రకారం 2026 ఆగస్టు నాటికి అందజేయాల్సి ఉంది. అయితే, ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితులు మరియు సరిహద్దు ఉద్రిక్తతల దృష్ట్యా, ఈ డెలివరీలను మరింత ముందుగా, అంటే వీలైనంత త్వరగా పూర్తిచేయాలని భారత్ భావిస్తోంది. ఈ దిశగా రష్యా అధికారులతో దోవల్ చర్చలు జరిపి, వారిని ఒప్పించే ప్రయత్నం చేయనున్నట్లు తెలుస్తోంది. ఎస్-400 వ్యవస్థలు శత్రువుల యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను దాదాపు 400 కిలోమీటర్ల దూరంలోనే గుర్తించి, అత్యంత కచ్చితత్వంతో కూల్చివేయగలవు. అంతేకాకుండా, ప్రత్యర్థుల ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థలను కూడా ఇది సమర్థవంతంగా ఎదుర్కోగలదు. ప్రస్తుతం ఈ అత్యాధునిక రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం పర్యవేక్షిస్తోంది. పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే ముప్పును దృష్టిలో ఉంచుకుని పంజాబ్, రాజస్థాన్‌లలో, చైనా నుంచి రక్షణ కోసం ఈశాన్య రాష్ట్రాల్లో (అరుణాచల్ ప్రదేశ్ లేదా అసోం) వీటిని మోహరించినట్లు సమాచారం. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత ఎస్-400 వ్యవస్థలను ధ్వంసం చేశామంటూ పాకిస్థాన్ అసత్య ప్రచారం చేయగా, ప్రధాని మోదీ ఎస్-400 మోహరించిన స్థావరం నుంచి ఫొటో విడుదల చేశారు. భారత సైన్యం కూడా పాక్ ప్రచారాన్ని ఖండించి, మన రక్షణ వ్యవస్థలు సురక్షితంగా, సమర్థవంతంగా ఉన్నాయని స్పష్టం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో, మరిన్ని ఎస్-400 వ్యవస్థలు త్వరగా చేరితే, భారత రక్షణ వలయం మరింత పటిష్ఠం కానుంది.

## గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

గడ్చిరోలి: మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు



మృతి చెందారు. పోలీస్ స్పెషల్ కమాండో యూనిట్ సీ-60, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గడ్చిరోలి జిల్లాలో ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కవండే ప్రాంతంలో ఇటీవల ప్రారంభించిన ఫార్వార్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్‌వోబీ) సమీపంలో మావోయిస్టులు ఉన్నట్లు అందిన సమాచారం ఆధారంగా గురువారం మధ్యాహ్నం ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. భారీ వర్షం మధ్య దాదాపు 300 మంది సీ-60 కమాండోలు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆపరేషన్ నిర్వహించారని.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరపడంతో భద్రతా దళాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు. దాదాపు రెండు గంటల పాటు కాల్పుల అనంతరం భద్రతాదళాలు గాలించగా నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనా స్థలంలో కొన్ని తుపాకులు, వాకీటాకీ, నక్సల్ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతతో పాటు 27మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.

# కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ

మొదటి పేజి తరువాయి



ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో థీమాటిక్ డిఫెన్స్ హబ్‌ల ఏర్పాటు, డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ) అనుబంధ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఉత్కృష్టతా కేంద్రాలు) స్థాపన వంటి ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందు ఉంచినట్లు చంద్రబాబు వివరించారు. వీటితో పాటు, రాష్ట్రంలో వ్యూహాత్మక మౌలిక సదుపాయాల కల్పన, విధానపరమైన నూతన ఆవిష్కరణల ద్వారా రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని, రాష్ట్ర అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ప్రోత్సాహకరమైన స్పందన, మద్దతు పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ఎంతగానో దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

### కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో చంద్రబాబు భేటీ



ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన కింద ఆంధ్రప్రదేశ్‌కు రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ సర్కారు విజ్ఞప్తి చేసింది. దీనిపై కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి ప్రతిపాదనలు అందించినట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశం ఫలప్రదమైందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాల నివాసాల్లో సౌర వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ యూనిట్లను పెద్ద ఎత్తున నెలకొల్పడం ద్వారా ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించడంతో పాటు, పర్యావరణ హితమైన ఇంధనాన్ని ప్రోత్సహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. ఒక్కో నియోజకవర్గంలో 10 వేల యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన కింద రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వెనుకబడిన తరగతుల (బీసీ) వినియోగదారులకు సబ్సిడీపై రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లను అందుబాటులోకి తీసుకురావాలని కూడా కేంద్రానికి ప్రతిపాదించామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందం పాల్గొన్నారు.

# జి. ఓ ప్రకారం 15,600, కార్మికుల కష్టార్జితం, కాంట్రాక్టర్ల జేబులోకా?



ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్

గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): రాష్ట్రంలోని సర్కారీ దవాఖానల్లో పనిచేసే కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ సిబ్బంది కష్టాన్ని కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని ఇచ్చే అరకొర జీతంలోనూ కోత పెడుతున్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ వారి లెక్కల్లో మాత్రం పూర్తిగా చెల్లిస్తున్నట్లు చూపుతున్నారని ఇలా నెలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.2.60 కోట్లకు పైగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.రాష్ట్రవ్యాప్తంగా సర్కారీ దవాఖానాల్లో 10 వేల మందికి పైగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ విభాగాల్లో పనిచేస్తున్నారన్నారు.ఒక్క హైదరాబాద్‌లోనే సుమారు 4 వేల మంది ఉన్నారు. మొదట్లో వీరికి వేతనాలు చాలా తక్కువ. ఆ తర్వాత పీఆర్సీ మేరకు వేతనాలు పెంచారు. ఈ మేరకు 11 జూన్ 2021న అప్పటి ప్రభుత్వం జీవో నంబరు 60 విడుదల చేసింది. గ్రేడ్-1 వర్కర్ల కింద వచ్చే వీరికి రూ.15,600 వేతనం ఇవ్వాలని పేర్కొంది అన్నారు. ఇందులో పీఎఫ్, ఈఎస్ఐ క్రింద రూ.3,507 కట్ చేయాలని మిగిలిన రూ.12,093ను వర్కర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. కానీ అలా జరగడం లేదు. ప్రస్తుతం కేవలం రూ.11,000 మాత్రమే జమ చేస్తున్నారు. మిగిలిన రూ.1,093 మ్యాన్‌పవర్ ఏజెన్సీల కాంట్రాక్టర్లు నొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇదొక్కటే కాదు నిబంధనల మేరకు వర్కర్ల వేతనాల నుంచి పీఎఫ్ కింద 12 శాతం, ఈఎస్ఐ క్రింద 0.75 శాతం మాత్రమే కట్ చేయాలి. దీనికి మ్యాన్‌పవర్ ఏజెన్సీ పీఎఫ్ లో తన వాటా కింద 13.25 శాతం, ఈఎస్ఐ కోసం 4 శాతం జమ చేయాలి. వర్కర్లు, ఏజెన్సీ వాటా కలిపి 30 శాతం ఉండాలి. కానీ మొత్తం 30 శాతాన్ని వర్కర్ల వేతనాల్లోనే కోత పెడుతున్నారని అగ్రహం వ్యక్తం చేసారు.ఇలా రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ప్రతి నెలా సుమారు రూ.2.60 కోట్లు కోల్పోతున్నారు. దీనిపై కార్మిక సంఘాల నేతలు పలుమార్లు వైద్య విద్య సంచాలకులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శిని కలసి జీవో ప్రకారం వేతనాలు అందడం లేదని, చర్య తీసుకోవాలని కోరారు. అయితే గత సర్కారు స్పందించలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో మరోమారు కార్మికులంతా ఇటీవల డీఎంఈని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర కార్మిక శాఖ ఉన్నతాధికారులకు కూడా లేఖలు రాశారు. కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ పేరిట కట్ చేస్తున్న మొత్తాన్ని కూడా సరిగా జమ చేయడం లేదని అగ్రహం వ్యక్తం చేసారు. ఒక్కో కార్మికుడి వేతనం నుంచి ఆ రెండిటి పేరిట రూ.5,507 కట్ చేయడం సరికాదన్నారు.పడకల సంఖ్యకు తగ్గట్లు సిబ్బంది లేరు,ప్రభుత్వం నిబంధనల ప్రకారం సర్కారీ దవాఖానల్లో ప్రతి వంద పడకలకు కచ్చితంగా 45 మంది శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది ఉండాలి. కానీ ఎక్కడా కూడా ఈ నిష్పత్తిలో వర్కర్లు ఉండటం లేదు. గత ప్రభుత్వ హయాంలో వీరికి న్యాయం జరగలేదు కనీసం ఈ కొత్త ప్రభుత్వమైనా న్యాయం చేయాలి అని డిమాండ్ చేసారు.పీఎఫ్, ఈఎస్ఐ వాటాను కూడా వర్కర్ల వేతనాల నుంచే కట్ చేయడం అన్యాయం. దీనిపై డీఎంఈ, కార్మిక శాఖ కమిషనర్ స్పందించాలని, వారికి కనీసం కొత్త ప్రభుత్వమైనా అన్ని విధాలుగా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేసారు.కార్మికులు కష్టాన్ని శ్రమను దోచుకుంటున్న, మరియు నెల నెల కార్మికులకు వేతనాలు ఇవ్వని కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టాలని దినేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

## ఎన్ హెచ్ ఆర్ సి
## మంగపేట జాతీయ మానవ హక్కుల కమిటీ పరామర్శ




మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్): శుక్రవారం రోజున తిమ్మంపేట ఎన్ హెచ్ ఆర్ సి గ్రామ శాఖ అధ్యక్షులు బోడ ప్రవీణ్ (ప్రెస్ రిపోర్టర్) నాన్న అయినటువంటి బోడ సమ్మయ్య దశదినకర్మలకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మరియు మంగపేట మండల ఎన్ హెచ్ ఆర్ సి అధ్యక్షులు కర్రి శ్రీను కార్యదర్శి ముంజంపల్లి సంపత్ ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సన్న గుండ్ల వెంకటేశ్వర్లు జిల్లా ఉపాధ్యక్షులు గాదె శ్రీనివాసాచారి. గోవిందరావుపేట అధ్యక్షులు కొండి రమేష్. జిల్లా ఈ సి నెంబర్ మల్లికంటి శంకర్, రాజుపేట అధ్యక్షులు ఎండి కౌసర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ బాబు త్వరగా కోలుకోవాలని... స్వామివారిని వేడుకున్న కావిరి అంజన రావు





మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):కొమురవెల్లి శ్రీ మల్లన్న స్వామి ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులతో దైవ మంత్రోచరణతో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఇటీవల సర్జరీ జరగగా త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించి కొమురవెల్లి మల్లన్న ఆశీర్వాదం వారికిపై ఎల్లవేళలా ఉండాలని దైవ సన్నిధిలో వేడుకున్నారు కావిరి అంజన్ రావు నేత.

## హెచ్.ఏ.ల్ లో కార్మికుడు
## సింగూరి ప్రసాద్ బాబు పదవి విరమణ కార్యక్రమం







తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), మే 23:ఈ నెల పదవి విరమణ చేయబోతున్న హెచ్.ఏ.ల్ లో పనిచేస్తున్న కార్మికుడు సింగూరి ప్రసాద్ బాబు పదవి విరమణ కార్యక్రమం హెచ్.ఏ.ల్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన పదవి విరమణ మహోత్సవ కార్యక్రమానికి టూల్ రూమ్ డిపార్ట్మెంట్ కార్మికులు శాలువాతో సత్కరించి పూలమాలతో శుభాకాంక్షలు తెలియజేసారు. 43 సంవత్సరాలు హెచ్.ఏ.ల్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేశారు భారత దేశానికి సేవాలాందిస్తున్న త్రివిధ దళలలకు ఎయిర్ క్రాఫ్ట్ అందిస్తున్న హెచ్.ఏ.ల్ పరిశ్రమల లో కార్మికుడు పనిచేసినందుకు దేశానికి సేవ చేసే అవకాశం దొరికినందుకు గర్వపడుతున్నాను అని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో హెచ్.ఏ.ల్ చీఫ్ మేనేజర్ రమేష్ బాబు,సీనియర్ మేనేజర్ రాజాప్రశాంత్, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, క్రాంతికుమార్, నవీన్, ముజీబ్,సత్యనారాయణ, చలం,సుదర్శన్,శ్రీకాంత్, శివ, రవిసుందర్, రాజ్ కుమార్ గౌడ్, లక్ష్మణ్ రాజు, సతీష్, విద్యాసాగర్,బాల్చందర్, ఉన్నతధికారులు, యూనియన్ నాయకులు, అసోసియేషన్ సభ్యులు, మహిళా కార్మికులు, ప్రసాద్ బాబు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదం విజయ్ కుమార్ జన్మదినవేడుకల్లో సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు..





తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్ ),మే 23 : సికింద్రాబాద్ నియో జకవర్గం, అడ్డగుట్ట డివిజన్, కొండారెడ్డి నగర్ లో ఆదం విజయ్ కుమార్ నివాసంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ యొక్క కార్యక్రమానికి సంతోష్ యాదవ్, దొమ్మాటి శివకుమార్, బోయిన్పల్లి మార్కెట్ డైరెక్టర్ ఆమెర్, ప్రీతం, జగదీష్, రవి నాయక్,ఆరిఫ్, పాల్గొని, కేక్ కట్ చేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సికింద్రాబాద్ నియోజకవర్గంలో అన్నా అని పిలిస్తే నేనున్నాను భరోసా ఇచ్చే నాయకుడు ఆదం విజయ్ కుమార్ అన్న అని అన్నారు. వారు నిండు నూరేళ్లు చల్లగా ఆ భగవంతుడు కాపాడుతూ ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని భగవంతుని కోరుకున్నారు. మరియు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భారీగా పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సేవలు పల్లె పల్లెకు చేరాలి
## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రకాష్



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్):పరకాల పట్టణ కేంద్రంలో రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నూతన భవనానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాలలో నిర్మించనున్న బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నూతన భవనానికి ఈరోజు భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో, పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డా. కడియం కావ్య,జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి పి. ప్రావీణ్య, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు మరియు పాలకవర్గ సభ్యులు సంయుక్తంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పరిపూర్ణ సామాజిక మార్పు కోసం యువతను స్ఫూర్తిదాయక మార్గంలో నడిపించాలి అని అన్నారు.మత్తుపదార్థాల వాడకాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రెడ్ క్రాస్ భవన నిర్మాణానికి రూ. కోటి 50 లక్షల నిధులు మంజూరయ్యాయి అని, మరిన్ని సేవల కోసం అవసరమైతే నా వంతు సహాయం చేస్తాను అని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూరెడ్ క్రాస్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి. రక్తాన్ని సేకరించి భద్రపరచడమే కాకుండా, ప్రమాదాల సమయంలో, ప్రసవాల్లో, థలసీమియా బాధితులకు ఇది ప్రాణ రక్షక సాధనంగా నిలుస్తుంది. ప్రతి ఒక్కరూ కనీసం మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలి.అలాగే కౌమార దశ బాలికల కోసం అవసరమైన ఐరన్ మాత్రలను అందించే కార్యక్రమం ప్రారంభించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి పి. ప్రావీణ్య రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, బొమ్మినేని పాపిరెడ్డి (ట్రెజరర్), సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డా. మాగంటి శేషుమాధవ్, డా. సంధ్యారాణి, బిళ్ళ రమణారెడ్డి, శాశ్వత సభ్యులు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, పోలీసులు మున్సిపల్ ప్రతినిధులు, ఇతర పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కారానికి ఆర్ జీ 1. జీఎం ఆపీసు వద్ద ధర్నా
## కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి :
# ఐ కృష్ణ. ఐఎఫ్ టియు రాష్ట్ర అధ్యక్షులు




గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్, శుభోదయం న్యూస్): సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్య పరిష్కారానికి ఈరోజు ఐ ఎఫ్ టీ యు ఆధ్వర్యంలో ఆర్ జీ 1.జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా నుద్దేశించి ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ మాట్లాడుతూ సింగరేణి సంస్థ లో గత 30 సంవత్సరాలుగా సర్వీస్ పూర్తి చేసి అనారోగ్య కారణాల వలన కార్పొరేట్ మెడికల్ బోర్డు వారిచే మెడికల్ ఇన్వాలిడెట్ ఉద్యోగం కొరకు దరఖాస్తు చేసుకుంటే విజిలెన్స్ అధికారులు మారుపేర్ల పై ఉద్యోగం చేసిన వారిని రెండు పేర్లు ఉన్నాయని కారణంతో దరఖాస్తు చేసుకున్న డిపెండెంట్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకుండా గత 15 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సకాలంలో సింగరేణి ఉద్యోగం రాక ఎలాంటి ఉపాధి మార్గం లేక కార్మికుల పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని వారి కుటుంబాల పోషణకు భారంగా మారిందన్నారు. గతంలో




మారుపేరుల సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు ఈనాటికీ మారు పేరుల సమస్యను పరిష్కరించలేదన్నారు.ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం మారుపేర్ల సమస్యను పరిష్కరించి విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జి ఎల్ బి కె ఎస్ ( ఐఎఫ్టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ నరేష్, బి అశోక్,మారుపేర్ల బాధిత సంఘం నాయకులు శ్రావణ్, శ్రీనివాస్, రామిల్ల సందీప్, కొమరమ్మ, వెంకటేష్, రాజు, రామగుండం రీజియన్ కార్యదర్శి ఈ రామకృష్ణ నాయకులు జి మల్లేశం చింతల శేఖర్, ఎస్ ప్రసాద్, ఏ చంద్రయ్య, ఎం కొమరయ్య ,ఎడ్ల రవికుమార్, సదానందం లతో పాటు 30 మంది పాల్గొన్నారు.

## తెలంగాణ జెన్ కో సీఈఓగా
## నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా.....



శుభాకాంక్షలు తెలిపిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాగూర్ ఈరోజు తెలంగాణ జెన్కో సీఈఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హరీష్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హరీష్ కి పుష్పగుచ్ఛం అందించి, భవిష్యత్తులో వారి సేవలు సంస్థ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. తరువాత, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సి ఎం డి తో సమావేశమై రామగుండం 1x800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (పవర్ ప్లాంట్) గురించి వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ చర్చలో ప్రాజెక్టు పురోగతి, ఆర్థిక సమర్థత, పర్యావరణ అనుమతులు, శాశ్వత ఉద్యోగాల అంశాలు మరియు స్థానికులకు ప్రయోజనాలు వంటి కీలక అంశాలను సిఎండి దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు వేగవంతంగా పూర్తికావడం ద్వారా రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా, స్థానిక అభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రతిస్పందిస్తూ, ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఉంటుందని, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని....
## జనక్ ప్రసాద్ ను కలిసిన
## ఉమ్మడి రాష్ట్రాల ఐఎన్టీయూసీ కార్యదర్శి పూసాల తిరుపతి



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): సింగరేణి ఎన్టీపీసీ ఆర్ ఎఫ్ సి ఎల్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మిక సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ అడ్వైజర్ చైర్మన్ జనక్ ప్రసాద్ ను రాష్ట్ర ఐ ఎన్ టి యు సి కార్యదర్శి పూసల తిరుపతి కోరారు. శుక్రవారం ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందని కార్మిక సమస్యల పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేయాలని ఆయన కోరారు.

## రామగుండం నగర పాలక సంస్థ నాలుగవ డివిజన్లో
## సిసి రోడ్లు నిర్మించుటకు 2.00 కోట్లు మంజూరు
# పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్): రామగుండం నగర పాలక సంస్థ నాలుగవ డివిజన్ కృష్ణానగర్లో సిసి రోడ్లు నిర్మించడానికి రూ 2.00 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగవ డివిజన్లో పాత రోడ్లు శిధిలం కావడం, కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం సి సి రోడ్లు నిర్మించాలని స్థానిక శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు అంచనాలు తయారు చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించగా రామగుండం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూ. 2.00 కోట్ల తో పనులు చేపట్టడానికి అంచనా లు తయారు చేసి సమర్పించారు. ఈ అంచనాలకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలుపడంతో పాటు రూ 2.00 కోట్లు మంజూరు చేస్తూ వెంటనే పనులు చేపట్టడానికి తగు చర్యలు తీసుకోవలసిందిగా రామగుండం నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు . సాధ్యమైనంత త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) అరుణశ్రీ ని తెలిపారు.

## నాయిని చెరువును మినీ ట్యాంక్ బండ్ గా

## ఏర్పాటు చేస్తాం మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్..




శుభోదయం న్యూస్ / జమ్మికుంట టౌన్ మే-23: జమ్మికుంట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉమెన్ ఫర్ ట్రీస్ అమృత్ 2.0 లో భాగంగా మహిళలు అన్ని కార్యక్రమాలలో భాగస్వాములు అయి ఆర్థిక పురోగతిని సాధించాలని మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు ప్రాంతంలో మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణి, మెప్మా ఇంచార్జి టి.ఎం.సి. జ్యోతి, సీ.ఎల్ ఆర్పీ మంజులలు పరిశీలించి, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణిలు మాట్లాడుతూ మహిళా సంఘంలోని సభ్యులు రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటి, జియో ట్యాగ్ ద్వారా వాటిని విధిగా సంరక్షించాలన్నారు. మొక్కలు సక్రమంగా పెరిగే విధంగా పూర్తి భాద్యత సంఘ సభ్యులదే ఉంటుందని ఆయన అన్నారు. వర్షాకాలంలో కానీ, చలి కాలంలో కానీ, ఎండ కాలంలో కానీ వాటిని సంరక్షించి, వాటి పరిరక్షించాలని అయన పిలుపు నిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రానున్న రోజుల్లో నాయిని చెరువును మినీ ట్యాంక్ బండ్ గా చేయబోతున్నట్లు కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అర్పిలు, సంఘ సభ్యులు, ఈ శ్రీ కాంత్, పలువురు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్త శుద్ధితో ఉంది..

## హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్




శుభోదయం న్యూస్/ జమ్మికుంట టౌన్ మే-23: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యం పట్ల, పరిస్థితి బాగోలేక ఇబ్బందుల పాలైన వారికి సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఆదుకుంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం నాడు హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జమ్మికుంట పట్టణ, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన 86 మంది లబ్దిదారులకు 30,44,000/- విలువ చేసే చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లబ్ధిదారులు చెక్కులను వెంటనే బ్యాంక్ లో డిపాజిట్ చేసుకోవాలని, తమ దగ్గరికి వచ్చిన వెంటనే చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి లబ్దిదారునికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుడు, ఇల్లందకుంట దేవాలయ చైర్మెన్, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పూసాల గ్రామంలోని

## మిథీలా రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే -23: రైస్ మిల్లుల వద్ద ధాన్యం సకాలంలో దించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామంలోని మిథీలా ఇండస్ట్రీ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నామని, మిల్లులో వద్ద ధాన్యం వేచి ఉండకుండా వెంటనే దించుకోవాలని, ఎక్కడ ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందించిన ధాన్యానికి సంబంధించి సీ.ఎం.ఆర్. రైస్ ను నిర్దేశిత గడువు లోగా సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డి.టి.సి.ఎస్.లు మహేష్, రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య కారణంతో

## మరణించిన కుటుంబాలను పరామర్శించిన....

### హుజురాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్



శుభోదయం న్యూస్/ జమ్మికుంట టౌన్ మే-23: ఈరోజు జమ్మికుంట పట్టణంలో కొత్తపల్లి ఏరియాలో పది రోజుల క్రితం విజయగిరి వజ్రమ్మ వయసు 96 సంవత్సరాలు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించిన హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు. వారితో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిని రవి, పరశురాం, అన్నం ప్రవీణ్, పాతకాల అనిల్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కోర్టు పరిధిలోని క్యాంటీన్ కు అనుమతి ఇవ్వాలి

## కిషన్ రెడ్డి, ఈటెల, బోర్డు సీఈవో,

## ఎమ్మెల్యే, నామినేటెడ్ మెంబర్ లకు వినతి పత్రాలు



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,(శుభోదయం న్యూస్), మే 23 : సికింద్రాబాద్ కోర్టు కాంప్లెక్స్ సమీపంలో క్యాంటీన్ నూతన భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి లు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. క్యాంటీన్ రెండంతస్తుల భవన నిర్మాణానికి కంటోన్మెంట్ బోర్డు అధికారులు బెటర్మెంట్ చార్జెస్ కింద సుమారు 8లక్షల 70వేలు చెల్లించాలని నోటీసులు పంపారని, ఇంత పెద్ద మొత్తంలో తాము చెల్లించలేకపోతున్నట్లు వారు తెలిపారు. ఈ విషయమై అధికారులు, రాజకీయ నాయకులు సానుకూలంగా స్పందించి తమకు భవన నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్, బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద మల్లికార్జున్ లకు వినతి పత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సమస్యలో అధికారులు ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించినప్పటికీ, తమ సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, బోర్డు నుండి అనుమతులు ఇస్తే క్యాంటీన్ నిర్మాణం చేపడతామని వారు పేర్కొన్నారు. సికింద్రాబాద్ కోర్టుకు వచ్చే ప్రతి ఒక్కరి సౌకర్యార్థంగా క్యాంటీన్ నిర్వహణకు తాము ముందుకు వచ్చామని, శిథిలావస్థలో ఉన్న క్యాంటీన్ ను నిర్వహించడం కష్టంగా ఉండడంతో నూతన భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా హైకోర్టు భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కంటోన్మెంట్ బోర్డు అధికారులు కూడా అనుమతులు ఇచ్చినట్లయితే భవన నిర్మాణం పూర్తి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గంటి మల్లికార్జున్, జాయింట్ సెక్రెటరీ వినోద్ కుమార్, లైబ్రరీ సెక్రెటరీ బోట్ల స్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుంజి సంతోష్, అడ్వకేట్స్ వెంకటరమణ రమణారెడ్డి, బాలస్వామి, జయశ్రీ, అడ్వకేట్స్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలను పాటిస్తూ

# విత్తనాలను విక్రయించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే- 23: పెద్దపల్లి జిల్లాలోని రైతులకు నిబంధనలను పాటిస్తూ విత్తనాలను విక్రయించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో విత్తనాల విక్రయంలో ఈ పాస్ యంత్రాల వినియోగంపై రిటైలర్లకు నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేటి అవినాష్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి జిల్లాలో విత్తనాల డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, రాబోయే సీజన్ లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రాబోయే వానాకాలం సాగుకు అవసరం అయ్యే విత్తనాలు ఏ ప్రాంతంలో ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేసి దానికి అనుగుణంగా అక్కడ ఆ విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వానాకాలం పంటకు అవసరమైన ఎరువులు, డీఏపి టన్నుల స్టాక్ అందుబాటులో ఉందని, డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను ఈ పాస్ యంత్రాల్లో అప్ డేట్



చేయాలని కలెక్టర్ సూచించారు. ఎరువుల లభ్యత పై అసత్య ప్రచారాలు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. గ్రీన్ మ్యాన్యుర్ స్టాక్ ను కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని అన్నారు. గత 2 సంవత్సరాలతో పోలిస్తే ప్రస్తుతం రెండింతలు అధికంగా ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా పంట కాలాన్ని రెండు వారాలు ముందుకు జరపాలని కోరుతున్నామని, దానికి అనుగుణంగా అవసరమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. రైతులకు ఎరువులు విత్తనాలు విక్రయించే సమయంలో పంట కాలాన్ని రెండు వారాల పాటు ముందుకు జరుపడం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. విత్తనాల బ్యాగ్ పై లేబుల్, నిల్వ చివరి గడువు తేదీ మొదలగు వివరాలకు స్పష్టంగా తెలియజేసి అమ్మాలని అన్నారు. విత్తనాల అమ్మకం రికార్డ్ వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్లు, రిటైలర్లు మాత్రమే విక్రయించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ పరిధిలో ఎవరైనా అనధికారంగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే సంబంధిత డీలర్ల నుంచి రైతులకు శాస్త్రీయంగా నష్టపరిహారం అంచనా వేసి చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేటి అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నేరుగా రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ నుంచి నాణ్యమైన విత్తనాలు అందే విధంగా కృషి చేస్తున్నామని, డీలర్లు సైతం ఈ విషయంలో పూర్తి స్థాయి సహాకారం అందించాలని అన్నారు. రైతులకు ఎక్కడ నష్టాలు రాకుండా నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులకు ఊరు పేరు లేని విత్తనాలు అమ్మడానికి వీలు లేదని అన్నారు. దిగుబడి కూడా ప్రభుత్వ రంగ సంస్థలో తయారు చేసిన విత్తనం బాగా ఉందని అన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం విత్తనాల రకాలు అందుబాటులో ఉన్నాయని, పెద్దపల్లి జిల్లాలో కనీసం పదివేల క్వింటాళ్లు ప్రభుత్వ రంగ విత్తనాలు అమ్మాలని డీలర్లకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పై కక్ష సాధింపు చర్యలకు తగిన మూల్యం తప్పదు

## ముటుకులోజు దయాకరాచారి


## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చౌటుప్పల్ మున్సిపాలిటీ



చౌటుప్పల్ మే 23 శుభోదయం న్యూస్: ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం, దేశానికి అన్నం పెట్టే స్థితికి చేరుకున్న తెలంగాణ రాష్ట్రం,వరి ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం,పోడు భూముల రైతులకు న్యాయం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్,ప్రపంచంలోనే ఎత్తిపోతల ప్రాజెక్టుగా చరిత్రకెక్కిన కాళేశ్వరం నిర్మాణంపై అవినీతి పేరిట గులాబీ అధిపతి కేసీఆర్ పై కక్ష సాధింపు చర్యలు సిగ్గుచేటని, ముటుకులోజు దయాకరాచారి విమర్శించారు. ఆయన ఒక ప్రకటనలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ధాన్యం దిగుబడిలో రాష్ట్రం ఆదర్శంగా నిలువగా, కెసిఆర్ ప్రత్యేక కృషి ఫలితంగా దేశానికి తెలంగాణ రైతు అన్నం పెట్టే స్థితికి చేరుకున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు నివారించివారిని ఆర్థికంగా బలోపేతం చేయగా, జీర్ణించుకోలేని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబంపై కక్షగట్టి కుట్రపూరిత చర్యలు చేపడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేసారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన

## కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోద రామకృష్ణ



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్): పరకాల మండలం అలియాబాద్ గ్రామ వాస్తవ్యులు జంగిలి జయపాల్ రావు- నీరజ దంపతుల కూతురు సుస్మిత - వెంకట సాయి తేజ్ వివాహ మహోత్సవం పరకాల లోని జి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరగగా ఈ వేడుక కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఏకు రాజు నాయకులు బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లుల చెల్లింపు

## మొగుదాల రమేష్ గౌడ్

## కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌటుప్పల్ మున్సిపాలిటీ



చౌటుప్పల్ మే 23 శుభోదయం న్యూస్: గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు రూ.153 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్ఒకేరోజు 9990 బిల్లులు క్లియర్ చేసిన ప్రభుత్వంఒకే విడతలో రూ.10లక్షల లోపు బిల్లుల చెల్లింపు2024ఆగస్ట్ వరకు ఉన్న పెండింగ్ బిల్లులకు ప్రాధాన్యం కింద చేపట్టిన వివిధ పనులకు రూ.85 కోట్లు విడుదల చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఉన్న పెండ్డింగ్ బిల్లులు క్లియర్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రతిదీ నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతూ ఇంకో పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని మొగుదాల రమేష్ గౌడ్ అన్నారు. కొందరు కావాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మీద బురదల్లే ప్రయత్నం చేస్తున్నారు ఇప్పుడు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు మీకు ఇచ్చిన పదేళ్లు అధికారంలో మీరు ప్రజలకు చేసింది శూన్యం కొందరు కావాలనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుడు వార్తలతో సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారు దానికి దీటుగా కాంగ్రెస్ సోషల్ మీడియా తిప్పి కొడుతుంది రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, మున్సిపాలిటీలో అన్ని కైవసం కాంగ్రెస్ పార్టీ చేసుకుంటుందని మోగుదాల రమేష్ గౌడ్ అభిప్రాయపడ్డారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్ లో జరుగుతున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ బొల్లికుంట గ్రామ వాస్తవ్యులు పెద్దపల్లి రాణి - సత్యం దంపతుల కుమార్తె మేఘన. ఆవునూరి లలిత - యాదగిరి దంపతుల కుమారుడు శ్రీనాథ్.ల వివాహ వేడుక మరియు గాడేపల్లి కి చెందిన నెల్లూట్ల రజిత-ప్రభాకర్ లి కుమార్తె నంధిత-శ్రీనివాస్ ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన పరకాల మాజీ ఎమ్మెల్యేచల్లా ధర్మారెడ్డి మరియు స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు ఈ కార్యక్రమంలో కిల్ల వరంగల్ సొసైటీ వైస్ చైర్మన్ సొల్తీ భూమాత, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కత్తెరపల్లి దామోదర్,బిఆర్ఎస్ నాయకులు తుమ్మ రవిందర్ రెడ్డి,తరగల ప్రసాద్,సొల్తీ నరేందర్,నెల్లూట్ల కుమారస్వామి,సదానందం,మేకల శ్రీను,పసునూరి వీరస్వామి, కనకయ్య,గడుదుల నర్సింహులు, రమేష్, రాజు,గొల్లపెల్లి నవీన్,ప్రవీన్, రాజు,జనార్దన్,శివ, రమేష్,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్) మే 23: కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తుందని బోర్డ్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మదా అన్నారు . శుక్రవారం కంటోన్మెంట్ బోర్డ్ పాలకమండలి సమావేశం అనంతరం తమ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వ, రక్షణ శాఖ సహకారంతో అన్ని వార్డులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదే మాదిరిగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ రాష్ట్ర ప్రభుత్వ నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ప్రతిపాదన చేస్తే తాము సహకరిస్తామని పేర్కొన్నారు. దోబి ఘాట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జున్, ధనుంజయ్ చారి, బీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలను వేధిస్తున్న వీధి కుక్కలు

## చిన్నారులను వెంటాడుతూ గాయపరుస్తున్న వైనం



బల్లికురవ, శుభోదయం న్యూస్: స్థానిక మండల పరిధిలోని గుంటుపల్లి కొత్తపాలెం వల్లాపల్లి కొమ్మినేని వారి పాలెం నక్క బొక్కలపాడు చెన్నుపల్లి మల్లాయపాలెం తదితర గ్రామాలలో కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రజలు, చిన్నపిల్లలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రోడ్డు మీదకి రావాలంటే భయాందోళన గురవుతున్నారు. చాలాసార్లు కుక్కలు చిన్నపిల్లలపై దాడి చేయడం లాంటి సంఘటనలు కూడా జరిగి ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఈ విషయంపై ఎన్నోసార్లు అధికారులకు విన్నపించుకోవడం జరిగింది. కానీ కుక్కలు బెడద నుంచి ప్రజలను రక్షించలేకపోతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి ప్రజ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలు గ్రామల ప్రజలు కోరుతున్నారు.

## మే 30వతేది ఘనంగా
## శ్రీ పరంజ్యోతి అమ్మ భగవాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ట



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల మండలంలోని పాండురంగాపురం గ్రామంలో శ్రీ పరంజ్యోతి అమ్మ భగవాన్ ఆలయాన్ని మే 28, 29, 30వ తేదీల్లో ఘనంగా, వైభవంగా ప్రారంభిస్తున్నట్లు నంద్యాల జిల్లా కల్కి భగవాన్ టెంపుల్స్ ఇన్చార్జి దీక్షిత దాసాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 30వ తేదీ ఉదయం 8-27 నిమిషాలకు మిథున లగ్నమందు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులపాటు భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు అమ్మ భగవాన్ శిష్యురాలు దీక్షిత దాసాజ్ తెలిపారు. భక్తులందరూ కార్యక్రమానికి విచ్చేసి శ్రీ పరంజ్యోతి అమ్మ భగవాన్ ఆశీస్సులు పొందాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రీ పరంజ్యోతి అమ్మ భగవాన్ ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షులు చెన్నంపల్లి రాజశేఖర్, బొబ్బల రామసుబ్బారెడ్డి, సేగు కృష్ణమూర్తి, కసెట్టి కృష్ణమూర్తి, ఏవి సుబ్బారెడ్డి, బసిరెడ్డి, శేషి రెడ్డి, సేగు కృష్ణమూర్తి, గంగిశెట్టి జనార్ధన్, కోటిరెడ్డి, శ్రీనివాసులు, రామలింగం, భక్తులు, పాండురంగాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## యోగా వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): జిల్లా పోలీస్ కార్యాలయంలో మైదానం నందు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మే 21 నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రబాబు మాట్లాడుతూ క్రమం తప్పకుండా తీసుకునే ఆహారం లాగానే యోగాను కూడా మన దినచర్యలో భాగంగా చేసుకోవాలి. మనిషి క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల చాలా ఉపయోగాలు ఉంటాయి. ప్రతి మనిషి రోజువారి ప్రణాళికలో యోగాను చేర్చుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రావని, చేసే పనులు చురుగ్గా చేయగలరు. ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంగా అలవర్చుకోవాలి.ప్రతి మనిషి జీవనశైలిలో ఒత్తిడి లు వంటివి ఉండవనన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటు తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య,రిజర్వు ఇన్స్పెక్టర్లు మంజునాథ్ ,మరియు స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరిగేషన్ ఏఈ వెంకట సుబ్బయ్యకు వెలిగొండ ప్రాజెక్టు డీఈ గా పదోన్నతి



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): మాచర్ల ఇరిగేషన్ డిపార్ట్మెంట్ లో గత 16 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఏఈ ఎ. వెంకట సుబ్బయ్యకు వెలిగొండ ప్రాజెక్టు డీఈ గా పదోన్నతి కల్పిస్తూ ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన మల్లవరం మేజర్ కుడికాలువ,వీపీ సౌత్ మెయిన్ కాలువకు ఏఈ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన పదోన్నతిపై సహచర ఇరిగేషన్ విభాగం సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి
## సాత్వికను సత్కరించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



మార్కాపురం, శుభోదయం న్యూస్: పేదింట వికసించిన విద్యా కుసుమం. ఒక నిరుపేద కుటుంబానికి చెందిన బొప్పరాజు సాత్విక పదవ తరగతిలో రాష్ట్రస్థాయిలో మంచి 591 మార్కులు సాధించింది.



మార్కాపురం మండలం సీతా నాగులవరం గ్రామానికి చెందిన బొప్పరాజు కొండయ్య, కాశీ వెంకటలక్ష్మి దంపతులకు చెందిన సాత్విక ఇటీవల పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ చేతుల మీదుగా సత్కరించడం జరిగింది. సాత్విక మార్కాపురం మండలం, మిట్టమీదిపల్లి ఆదర్శ పాఠశాలలో పదవతరగతి వరకు చదివి విజయం సాధించింది..ప్రైవేట్ స్కూల్లో చదివించే స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలలోనే తల్లిదండ్రులు చదివించారు.సాత్విక తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు..సాత్వికను హైస్కూలు ఉపాధ్యాయులు, చందలూరి శ్రీనివాసులు, దేవలూటి శంకర్, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, గోపి తదితరులు అభినందించారు.

## జిల్లా మహానాడు
## కార్యక్రమంలో పాల్గొన్న పాల్గొన్న యారవ, పిడుగు



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా మహానాడు ఒంగోలు పట్టణంలో ఏ వన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి గాజువాక శాసనసభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు వారిని కనిగిరి



వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు మరియు వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాకు వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దారపనేని



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): శ్రీ కాకు సత్యనారాయణ శ్రీమతి బాల వెంగమ్మ దంపతుల కుమారుడు చిరంజీవి హరికృష్ణ, కనపర్తి కొండలరావు శ్రీమతి రమాదేవి దంపతుల ఏకైక కుమార్తె లక్ష్మీ సౌభాగ్యవతి సుదర్శిని ల వివాహ వేడుకలు విజయవాడలోని సాయి జ్యూయల్ నందు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో మానం మల్లికార్జున రావు దంపతులు, మానం కిరణ్ దంపతులు, మానం రాజకుమార్ దంపతులు, నూతలపాటి వెంకటేశ్వర్లు దంపతులు, రాములు దంపతులు, లక్ష్మణ దంపతులు, మద్రి నారాయణ దంపతులు, మానం వారి కుటుంబ సభ్యులు, నూతల పాటి వారి కుటుంబ సభ్యులు, మద్రి వారి కుటుంబ సభ్యులు, కాకు వారి కుటుంబ సభ్యులు, కనపర్తి వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## మల్లవరంలో బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో శుక్రవారం జరగనున్న బాల్యవివాహాన్ని స్థానిక రెవెన్యూ, పోలీస్, అంగన్వాడీ సిబ్బంది అడ్డుకున్నారు. గ్రామంలో నవాజీనాయక్ (22)కు 15 సంవత్సరాల వయస్సు గల బాలికతో వివాహం జరిపిస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ, పోలీస్ అధికారులు రంగప్రవేశం చేసి పెళ్లి అడ్డుకున్నారు. అనంతరం వారు కౌన్సిలింగ్ చేసి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను కుటుంబ సభ్యులకు తెలియపరచి,చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన శిక్షలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించి అధికారులు వారిని తహసీల్దార్ మేరీ కనకం ఎదుట వారిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ ఐ నాగార్జున, డిప్యూటీ తహశీల్దార్ బ్రహ్మయ్య, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి గుడికి విరాళం



లేపాక్షి, మండల రిపోర్టర్ – అమరేష్ (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ కుమారుడు సమాజసేవకుడు టీడీపీ నాయకులు వివిధ సేవ కార్యక్రమాలకు ముఖ్యంగా దేవాలయల అభివృద్ధికి తనవంతుగా ఆర్థిక సాయాన్ని అదిస్తున్న బత్తల ఆదినారాయణ రెడ్డి 15 వేల రూపాయలను విరాళంగా అందించారు. ఇంతే కాకుండా మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : గత ఏడాది ఆగస్టులో సంభవించిన బుడమేరు వరద ముంపుకు గురైన ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో కంప్యూటర్లను వితరణగా అందించారు. బుడమేరు వరదల్లో ఎన్టీఆర్ జిల్లాలోని సుమారు 67 పాఠశాలలు వరద ముంపుకు గురి కావటంతో ఆర్థికంగా నష్టపోయారు. దీంతో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు తమ ఇబ్బందులను అప్పట్లో వరద సహాయక చర్యల్లో పాల్గొన్న యార్లగడ్డ దృష్టికి తీసుకువెళ్లారు. ఇదే సమయంలో వరద ముంపు వల్ల ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న సుమారు 12,000 మంది విద్యార్థులు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు వరద నీటిలో మునిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని యార్లగడ్డకు వివరించారు. తక్షణమే స్పందించిన యార్లగడ్డ వీరి ఇబ్బందులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన లోకేష్ తొలిసారి ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పార్టీ పుస్తకాలు అందించేందుకు నిర్ణయించారు. వరద ముంపు కు గురైన పాఠశాలలకు సాయం చేస్తానన్న యార్లగడ్డ వెంకట్రావు తనతో పాటు తన స్నేహితులతో మాట్లాడి సి ఎస్ ఆర్ నిధులనుంచి సుమారు 14 లక్షల విలువచేసే కంప్యూటర్లు కంప్యూటర్ పరికరాలను అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న 27 ప్రవేటు పాఠశాలలకు కంప్యూటర్లు,ప్రింటర్లు, స్కానర్లను యార్లగడ్డ అందజేశారు. ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడంలో సహకరించిన యార్లగడ్డకు, మంత్రి లోకేష్ బాబుకు ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు, నాయకులు ఫణి ప్రసాద్, దేవినేని కిషోర్ కుమార్, గోన సాంబశివరావు, షేక్ ఇమామ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్ ఫలితాలు బ్రిలియంట్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం




నల్లచెరువు, మండలం రిపోర్టర్ – మాలిక్ బాషా, మే 23(శుభోదయం న్యూస్) :మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కార్తీక్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తమ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులు 11మంది ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాలలో క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఏకలవ్య మోడల్ స్కూల్లో తమ పాఠశాల విద్యార్థి భూక్యా అక్షిత్ కుమార్ నాయక్ రాష్ట్రస్థాయిలో 111వ ర్యాంకు సాధించాడనీ పేర్కొన్నారు. నవోదయ ఫలితాల్లో మండల టాపర్గా తమ విద్యార్థి శృతికుమార్ 73 మార్కులు, దినేష్ కుమార్ రెడ్డి 69 మార్కులు సాధించారని తెలిపారు. తనకల్లు మండల తాపరుగా విద్యార్థి యజ్ఞ అవినాష్ యాదవ్ 69 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోనీ విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీసే ప్రయత్నంలో బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం ఎప్పుడు ముందుంటుందన్నారు. నిరంతరం శ్రమ,నేర్చుకోవాలని తపన విద్యార్థుల్లో ఉంటే వారిలో ఉన్నటువంటి సృజనాత్మకతను బయటకు తీసి ఎటువంటి పోటీ పరీక్షల్లోనైనా విద్యార్థులు ఉన్నత ఫలితాలను సాధించే దిశగా బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో నీట్ ఐఐటి జేఈఈ ఒలంపియాడ్ వంటి ఉన్నతమైన పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు ఇలాంటి శిక్షణ చాలా అవసరమన్నారు. మండల వ్యాప్తంగా ఎవరైనా పేద ధనిక ఎస్సీ ఎస్టీ వేసి విద్యార్థులకు తమ నిర్వహించే పరీక్షల్లో క్వాలిఫై లేదా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తామని తెలియజేశారు.

# స్వచ్ఛభారత్ సెంటర్లను సందర్శించిన డి ఎల్ పి ఓ కృష్ణమోహన్



లింగసముద్రం కే సురేష్ (శుభోదయం న్యూస్): స్వచ్ఛభారత్ సెంటర్ల డి ఎల్ పి ఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పెద్దపవని గ్రామములో కొన్ని ఇండ్లకు తిరిగి తడి చెత్త పొడి చెత్త తీయుటకు క్లాత్ మిత్రాలు వస్తున్నారా లేదా అని అడిగి సక్రమంగా పని జరుగుతున్నట్టుగా గమనించటమైనది ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శి రషీద్ స్థానిక నాయకులు రఫీ కరిముల్లా పాల్గొనడం జరిగింది.

## గ్రామాల్లో మట్టి తవ్వకాలు అనుమతులు మంజూరు
## యార్లగడ్డజగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ రూల్స్ చదువుకోవాలి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్): గ్రామంలోని రైతులు, ప్రజల అవసరాల కోసం చెరువుల్లో మట్టి తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలోని తన కార్యాలయంలో వెంకట్రావ్ విలేకరులతో మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులలోని మట్టిని ప్రజల అవసరాల కోసం తరలించుకునేందుకు అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చెరువుల్లో మీటర్ లోతు మాత్రమే మట్టితవ్వి ట్రాక్టర్లు, ఎడ్లబడలో మాత్రమే మట్టిని తరలించుకోవాలని చెప్పారు. ఆయా పంచాయతీల కి నామమాత్రం రుసుము చెల్లించి మట్టిని తోలుకోవాలన్నారు. రాత్రివేళ మట్టి తవ్వకాలు అనుమతులు ఇచ్చేది లేదని చెప్పిన ఆయన మట్టి తరలింపు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతిపై అవాకులు చవాకులు పేలుతున్న జగన్మోహన్ రెడ్డి వైఖరిని ఆయన తప్పుపట్టారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా రాజధాని అమరావతిని మార్చాలని శక్తి వంచన లేకుండా కృషి చేశారని ఆయన కుయుక్తులు పారకపోవడంతో మూడు రాజధాని అంశాన్ని తెరపైకి తెచ్చారని గుర్తు చేశారు. జగన్ సీఎంగా ఉండగా రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శరవేగంగా రాజధాని నిర్మాణ పనులు చేస్తుంటే చూసి ఓర్వలేక ఇష్టారీతిన మాట్లాడటం తగదని హితవు పలికారు. గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను లాగేసి చంద్రబాబు ప్రతిపక్ష హోదా తీసేస్తానన్న జగన్ ఇప్పుడు ఏ విధంగా ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని నిలదీశారు. అసెంబ్లీ రూల్స్ తెలిసే అబద్ధాలు ఆడుతున్న జగన్ ఒకవేళ అసెంబ్లీ రూల్స్ గుర్తు లేకపోతే నిబంధనల పుస్తకాన్ని నాలుగుసార్లు చదువుకోవాలని జగన్ కు హితవు పలికారు. చంద్రబాబు తనకు జరిగిన అవమానానికి నిరసనగా అసెంబ్లీని బహిష్కరించారని అసెంబ్లీ కి రాని జగన్ కు ఏ అవమానం జరిగిందని సూటిగా ప్రశ్నించారు. జగన్ అసెంబ్లీకి రాకపోవడం ఎన్నుకున్న ప్రజల్ని, అసెంబ్లీని అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. తాను అధికారంలోకి వస్తే సినిమా చూపిస్తానన్న జగన్ కామెంట్లు పై యార్లగడ్డ స్పందిస్తూ వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య 164 నుంచి 11 పడిపోయిందని ముందు పార్టీని ఏ విధంగా బతికించుకోవాలో చూసుకోవాలని హితవు పలికారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెడితే ఆయనకు నివాళులర్పించినట్లు కాదని అంబేద్కర్ ఆశయాలను తూచా తప్పకుండా అమలు చేయడం వల్లే అంబేద్కర్ నివాళులర్పించినట్లు అవుతుందని జగన్ ను ఎద్దేవా చేశారు. డిసిసిలలో జరిగిన అక్రమాలపై తన అసెంబ్లీలో విచారణ కోరగా శాసనసభ కమిటీ వేశారని కమిటీ విచారించి నివేదిక ఇస్తుందని ఈ మేరకు అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని యార్లగడ్డ హెచ్చరించారు. శాసనసభ కమిటీ వేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజులకు ఈ సందర్భంగా యార్లగడ్డ ధన్యవాదాలు తెలిపారు.

# వైకుంఠపురం బ్యారేజి నిర్మించాలికృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరించాలి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : కృష్ణాజిల్లా టి.డి.పి. మినీ మహానాడులో వెల్లడించిన సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు "ఆళ్ళ"కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో ఈరోజు ఉదయం జిల్లా టి.డి.పి. అధ్యక్షులు, ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అధ్యక్షతన జిల్లా తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు ను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో గన్నవరం నియోజకవర్గం నుంచి పాల్గొన్న సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు కృష్ణాడెల్టా ఆయకట్టు స్థిరీకరణకు వైకుంఠపురం బ్యారేజి నిర్మించాలని ఒక తీర్మానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళారు. అనంతరం ఇదే విషయమై ఈరోజు సాయంత్రం రంగన్నగూడెం లోని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య క్యాంపు కార్యాలయం నుండి ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-2019 లో రాష్ట్ర విభజన తరువాత కృష్ణానదికి పైనుంచి నీటి ప్రవాహం తగ్గిన నేపథ్యంలో కృష్ణా డెల్టా పరిరక్షణకు కృష్ణానదిపై వైకుంఠపురం-దాములూరు గ్రామాల మధ్యన 10 టి.ఎం.సి.ల నిల్వ సామర్థ్యం తో 3,600 కోట్ల అంచనాతో వైకుంఠపురం బ్యారేజి కి నిధులు కేటాయించి శంఖుస్థాపన చేయటం జరిగిందని, తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వై.సి.పి. ప్రభుత్వం మూర?త్వంగా ఈ పనులను రద్దు చేసిందని ప్రస్తుత పరిస్థితుల్లో కృష్ణానది పైనుంచి నీరు రాకపోయినా కట్టలేరు, మున్నేరు, పాలేరు తదితర వాగులనుంచి వచ్చే వరద నీటిని సద్వినియోగం చేసుకోవటానికి వీలుగా మళ్ళీ వైకుంఠపురం బ్యారేజిని నిర్మించి కృష్ణాజిల్లాలోని కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో తీర్మానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. అట్లాగే గన్నవరం నియోజకవర్గంలోని పోలవరం కుడికాలువ బండారుగూడెం 137 కి.మీ. నుంచి ఏలూరు కాలువ 36 కి.మీ. వరకు లింకు చానల్ ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చి 80 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు విశేషంగా కృషి చేసి తుది అంచనాలు రూపొందించి ప్రతిపాదించిన 32 కోట్ల నిధులను మంజూరు చేయించాలని, గన్నవరం నియోజకవర్గంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ లో 60 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని సమావేశం దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, బాపులపాడు మాజీ జెడ్.పి.టి.సి. వేగిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## వంశీ మోహన్ కి మంచి ఆరోగ్యం ఇవ్వాలని, అక్రమ కేసులు నుండి బయట పడే విధంగా..... దివించమని ప్రార్థించిన జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :పేదలపాలిటీ పెన్నిది,ఆపదబంధవుడు,వల్లభనేని వంశీ మోహన్ నిరెడ్డ్ బుక్ రాజ్యాంగం కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు బానాయించి వంద రోజులు పైన జైలులో ఉంచారు.ఆయన ఆరోగ్యం క్షిణించింది అన్ని కేసులలో బెయిల్ వచ్చినను జైలు నుండి బయటకు రానీయకుండా అధికారా దుర్వినియోగం చేస్తూ మరి కొన్ని కొత్త కేసులు పెట్టి విచారణ పేరుతో కష్టడికి తీసుకొని మాసికంగా విబ్బంది పెడుతున్నావారికి బూద్ధి ప్రసాదించి వంశీ కి వెంటనే బెయిల్ వచ్చే విధంగా దివించాలని వంశీ యూత్ కేసరపల్లి గ్రామంలో అంజనేయస్వామిగుడిలో చేస్తూన్నా పూజలో పాల్గొన్నా గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి తెలిపారు.వంశీ ఫొటో ప్లే కార్డులతో వంశీ యూత్ అందరు కొబ్బరికాయలు కొట్టి వేడుకున్నట్లు తెలిపారు.అంతే కాదు వంశీ శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్నారు. అయిన ఫై కక్షా సాధింపు చర్యలు ఆపటం లేదు.పోలీస్ కష్టడి పేరుతో బెయిల్ రాకుండా ఆటంకం పెట్టే కూటమి నాయుకులుకు సరిఅయినా బుద్ధి చెప్పి వంశీకిమంచి ఆరోగ్యం ప్రసాదించి ఆయనను వెంటనే బెయిల్ ఫై వచ్చే విధంగా దివించాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ రోజు మేమే కాదు వైస్సార్సీపీకార్యకర్తలు నాయుకులు, గన్నవరం నియోజకవర్గం లోని ప్రజలు రాష్ట్రము లోని వంశీ ని అభిమానించే వేలాది మంది ప్రజలు దేవాలయాలలో వంశీ పై పెట్టిన అన్ని కేసులు అక్రమైనవి అని ప్రార్థనలు చేస్తున్నారని జడ్పీటీసీ తెలిపారు.ఈకార్యక్రమంలోవైస్సార్సీపీ నాయుకులు,దాసరి శ్రీనివాసరావు, డి వి, పలాగని శివాజీ,మాదు వేణు,బుగ్గల రాజేష్,బాపట్ల రవి, దాసరి విజయ్ పలాగని మహేష్, పామర్తి సాయి,తల్లిబోయిన వాసు,తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాలకు పాల్పడితే ఖబర్దార్ తాసిల్దార్ ఆకులతిరుమల బాబు



**సిద్ధవటం, మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని సిద్ధవటం తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు భూకబ్జాలపై ప్రత్యేకంగా నిఘ ఏర్పాటు చేస్తామని ఎవరైనా భూకబ్జాలు చేస్తే ఖబర్దార్ అని అట్టివారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ తిరుమల బాబు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా భూ సమస్యలు ఉన్న భూమి ఆక్రమించుకున్న ప్లాట్ల విషయాలు కానీ పత్రాలు లేకుండా ఎవరైనా పనులు చేసిన భూములు చదివిన చేసిన వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ముందుగా ఆయన సిద్ధపటం తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టారు. మండలంలో కార్యాలయానికి సంబంధించి ఏ సమస్యలు వచ్చినా కూడా అందరూ కలిసికట్టుగా ఎదుర్కొంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మాధవి లత రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.**

## బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మకి పుట్టినరోజు శుభాకాంక్షలు బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం నాయకులు



(శుభోదయం న్యూస్): బాపట్ల నియోజకవర్గం అభివృద్ధి బాగుండాలి మా శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ చల్లగా ఉండాలి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కల్లుగీత కార్పొరేషన్ ఛైర్మన్ తాత జయప్రకాష్ బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఉప్పాల మురళి గౌడ్,

## బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పుట్టినరోజు వేడుకల్లో ఎన్టీఆర్ విగ్రహాన్ని పూల మాలలు



(శుభోదయం న్యూస్): ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పుట్టినరోజు సందర్భంగా టిడిపి పార్టీ కార్యాలయంలో ఉన్న దివంగత ఎన్టీఆర్ విగ్రహనికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## సొంత నిధులతో వంతెన నిర్మాణం జన్మదినం సందర్బంగా ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ




(శుభోదయం న్యూస్): బాపట్ల నియోజకవర్గం శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మరొక్క సారి వారి గొప్ప మనసు చాటుకున్నారు బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ సుబ్బారెడ్డి పాలెం గ్రామంలో గతంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పర్యటించినప్పుడు గ్రామస్తులు నరేంద్ర వర్మకి గ్రామంలో సమస్యలను తెలియచేస్తూ ప్రధాన సమస్యగా ఉన్న వెస్ట్ బాపట్ల ఛానల్ మీద బ్రిడ్జి నిర్మించాలని కోరగా ఆనాడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండ వంతెన నిర్మాణం చెప్పడతాము అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పి4 కార్యక్రమంలో భాగంగా




నేడు సొంత నిధులుతో సుబ్బారెడ్డి పాలెం గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం వంతెన ఏర్పాటు చేసారు. ఈ వంతెన ఏర్పాటుతో పడమర బాపట్ల పంచాయతీల్లో డంపింగ్ యార్డ్ కి ఎటువంటి సౌకర్యం లేనందువలన ఈ బ్రిడ్జి నిర్మాణం ద్వారా డంపింగ్ యార్డ్ కి సుఖమయం అయినది గతంలో గ్రామస్తులు రాకపోకల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా నేడు వారి ఇబ్బందులు అన్ని తిరిపోయాయి అదే విధంగా ఈ వంతెన ఏర్పాటు ఎంతో ఉపయోగకరమని గ్రామస్తులు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. 35 సంవత్సరాల కల నెరవేర్చిన బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజుకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆదిత్య స్కూల్ నరసారాజు కుమార్తె వివాహ వేడుకలు పాల్గొన్న బోయల్ల, పిడుగు



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు పట్టణ పువ్వాడి ఫంక్షన్ హాల్ నందు జరిగిన ఆదిత్య స్కూల్ మాస్టర్ ఎం నరసరాజు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ సింగల్ విండో ఛైర్మన్ బోయల్ల నారాయణరెడ్డి మరియు వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులుఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు వాయునేని రాఘవ, కొండ నరసింహ, తడికమళ్ళా సుబ్బారావు సుబ్బారావు, మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## మంథని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన డీసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్

మంథని పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని మరియు మాత శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు జిల్లా సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ సందర్శించి డాక్టర్స్ మరియు స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ నీ తనిఖీ చేశారు. విధులకు హాజరు కాని డాక్టర్లు కు మెమోలు జారీ చేయడం జరిగింది. అదే విధంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు పట్ల దురుసుగా ప్రవర్తించకుండా మర్యాదగా ప్రవర్తించి వారి యొక్క సమస్యను తెలుసుకుని నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. త్వరలోనే బయోమెట్రిక్ అటెండెన్సు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు గర్భిణీలకు తక్షణమే వైద్య సేవ అందించాలని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు నేపథ్యంలో అంబులెన్సలు,102 వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.

## కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు ఘన సన్మానం

హుజురాబాద్ పట్టణంలోని స్థానిక న్యూ కాకతీయ ఉన్నత పాఠశాలలో గ్లోబల్ ఫోటోకాన్ కరాటే డు అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో బెల్ట్ మెరిట్ టెస్టులో కరాటే విద్యార్థులు విజయం సాధించిన సందర్భంగా విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనైనది.ఇట్టి సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హుజురాబాద్ టౌన్ సిఐ టీ కరుణాకర్ గారు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, బెల్ట్ మెరిట్ టెస్టులలో విజయం సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించినారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే ను తన వృత్తిగా ఎంచుకొని ఎంతోమంది విద్యార్థుల ను తీర్చిదిద్దుతు వారి భవిష్యత్తుకు మంచి పునాది వేస్తున్న కృషీవలుడు కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ను మనస్ఫూర్తిగా అభినందించి నారు.కరాటే విద్యార్థులను మానసికంగా పరిపక్వత చెందునట్లు చేయడమే కాకుండా శారీరకంగా దృఢ పరుస్తుందని, అదేవిధంగా కరాటే పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తూ వారు సమాజంలోని ఏ సమస్యనైనా ఎదుర్కోవడానికి సంసిద్ధులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు.ముఖ్యంగా ఆడపిల్లలు ధైర్యంగా ముందడుగు వేస్తూ తమను తాము రక్షించుకోవడానికి కరాటే దోహదపడుతుందని వారు విశ్వాసాన్ని వ్యక్తపరిచినారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండా గణేష్,, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు ఖలీద్ హుస్సేన్. తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## గురుకుల ఇంటర్ కళాశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి నరేష్ రత్న జార్జి రెడ్డి పి డి ఎస్ యు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు

రాష్ట్రంలోని 12 సాంఘీక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలనీ జార్జి రెడ్డి పి డి ఎస్ యు విద్యార్థి సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నరేష్ రత్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో దాదాపు వందలాది మంది నిరుపేద విద్యార్థులు విద్యని అభ్యసిస్తున్నారని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం వందలాది మంది నిరుపేద విద్యార్థులకి విద్యని దూరం చేసేలాగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో జె ఇ ఇ, ఎం సెట్ ఫలితాలలో గురుకుల ఇంటర్ విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలతో సమాన స్థాయిలో రాణించారని, ర్యాంకులు, మంచి ఫలితాలు, మార్కులు సాధించారని అన్నారు. ప్రభుత్వ విద్యా బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు నిరుపేదల విద్యా సంస్థలను పలు కారణాలతో రద్దు చేయడం అన్యాయమనీ అన్నారు. అధిక నిధులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ లను సకాలంలో పూర్తి స్థాయిలో భర్తీ చేస్తే అడ్మిషన్ల కోసం విద్యార్థులు బారులు తీరుతారని అన్నారు. ఆ సాకు చూపించి ప్రభుత్వ విద్యా సంస్థల రద్దు అంటే కార్పొరేట్ విద్యా సంస్థల ముందు మోకరిల్లడమే అని ఎద్దేవా చేశారు. విద్యార్థుల, తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు దోపిడి చేస్తున్నాయని, ఈ విద్యా సంస్థల దోపిడి నుండి నిరుపేదలు రక్షణ పొందాలంటే తప్పని సరిగా గురుకుల కళాశాలలు కొనసాగించాలని కోరారు. సరైన వసతులు, నాణ్యమైన భోజన సౌకర్యం అందిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం విద్యను మరింత ప్రోత్సహించాల్సింది పోయి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ఇది సరైన కాదని అవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గురుకుల విద్యా సంస్థల రద్దుపై ప్రభుత్వ నిర్ణయాలను వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల అన్ని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల సమన్వయంతో ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు.

# గ్రామ సచివాలయంలో కిషోర్ వికాసం సమ్మర్ క్యాంప్ తరగతులు

మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిని కుమారి కె విజయకుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ప్రాజెక్టు సిడిపిఓ సిహెచ్ ఎస్ కె దుర్గా దేవి ఆధ్వర్యంలో జిల్లా బాలాల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి శుక్రవారం యు.కొత్తపల్లి మండలంలోని యండపల్లి గ్రామం సచివాలయంలో కిషోరీ వికాసము సమ్మర్ క్యాంపెయిన్ 7వ షెడ్యూల్ శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. కౌన్సిలర్ దుర్గారాణి మాట్లాడుతూ ఈరోజు షెడ్యుల్ ప్రకారం ఉన్నత విద్యా నైపుణ్యాలు మరియు కెరీర్ మార్గదర్శకత్వం అంశాలను తెలిపారు.వ్యక్తిగత మరియు సామాజిక ఎదుగుదలకు విద్య ప్రధానమైనది.ఐడిఐసామాజిక మరియు ఆర్థిక అసమానతలు తగ్గించడం ద్వారా విమర్శనాత్మకంగా ఆలోచించడానికి ప్రశ్నించడానికి మరియు ప్రపంచాన్ని బాగా అర్థం చేసుకోవడానికి విలువలతో కూడిన విద్య వ్యక్తులను సమర్ధం చేస్తుంది. విద్య స్థిరమైన మరియు సంతోషకరమైన జీవితానికి దోహదపడుతుంది.ఆర్థిక స్వాతంత్రం అందిస్తుంది.తప్పు ఒప్పుల అవగాహన కలిగిస్తుంది.చట్ట విరుద్ధమైన కార్యకలాపాలలో పాల్గొని అవకాశాన్ని తగ్గిస్తుంది మరియు దేశాభివృద్ధికి తోడ్పడుతుంది. అని తెలుపుతూ బాలలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి కిషోరీ వికాసాన్ని ఏ విధంగా సాధించాలి ,కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలాగ డెవలప్ చేయాలి అనే అంశాల పైన అలాగే బాలల హక్కులు చట్టాలు కౌమర్ బాలబాలికలసమస్యలు ,ఆరోగ్యవంతమైన నేను ,నా పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ, పిల్లల సంరక్షణలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ,బాల్యవివాహ నిర్మూలన చట్టాల గురించి అలాగే గురించి కౌమారంలో వచ్చే మార్పులు మరియు సమస్యల గురించి 18 సంవత్సరములు నిండకుండ వివాహం చేస్తే సంభవించే అనర్థాలు గురించి అంతేకాకుండా ఫెసిలిటేటర్ గ్రూప్ డిస్కషన్సు మరియు పిల్లలతో డ్రామాలు,రోల్ ప్లే లాంటివి చేయించడం ద్వారా పిల్లల్లో ఉన్న స్కిల్స్ కూడా డెవలప్ చేయడం వాళ్ళని ఎడ్యుకేట్ చేయడం అనే అంశాల మీద పిల్లలకు ఈ తరగతులలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అలాగే బాలలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా బాలల హెల్ప్ లైన్ 1098, కి కాల్ చేసి సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.సెక్టార్ సూపర్వైజర్ డి సుజాత,జీఎంస్ కె డి జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు వై. గౌరీ , వెంకట లక్ష్మీ, మరియు అర్చనమ్మ కిషోరి బాలికలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించడం జరిగింది.

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

రానున్న 3 నుంచి 4 రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా పెద్దపల్లి జిల్లా లో మే 27 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, ధాన్యం కొనుగోలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని అన్నారు. రైతులు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, విక్రయించని ధాన్యం భద్రపర్చుకోవాలని, వాతావరణంలో వస్తున్న మార్పులను గమనిస్తూ ఉండాలని, వర్షాలు కురిసే నేపథ్యంలో ధాన్యం తడువకుండా టార్పాలిన్ కవర్లు కప్పాలని కలెక్టర్ తెలిపారు.

# బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి.. దేవరకద్ర మండల విద్యాధికారి బలరాం..

: విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని దేవరకద్ర మండల విద్యాధికారి బలరాం అన్నారు. మహబూబ్ నగర్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కోన పాలమూర్ లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం శిక్షణ శిబిరం ను యం ఈ ఓ బలరాం పర్యవేక్షించి ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు తెలుగు, ఆంగ్లం ,గణితం, పరిసరాల విజ్ఞానంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. పాఠ్య ప్రణాళిక, విద్యా ప్రమాణాలు, బోధనా సోపానా లు, అభ్యసన ఫలితాలు, కరికులం విధానాలపై అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ పి లు శ్రీనివాస్ రెడ్డి, రాఘవేంద్ర కుమార్, నాగ రాజు, తిరుపతమ్మ, రమేష్, రాఘవేందర్, శంకర్ , పవన్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు నియోజకవర్గంలోని ఆరుగురు లబ్ధిదారులకు 5,12,345 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు సీఎం సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి అనేక పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆశ్రయంగా మారిందన్నారు. గత పది నెలల్లో నియోజకవర్గం లోని 30 మందికి పైగా లబ్ధిదారులకు

శుభోదయం

సంపాదకీయం

# మావోలకు పెద్ద దెబ్బ

## (విశ్లేషణ)

విస్తీర్ణంలో చాలా దేశాలతో పోలిస్తే ఎంతో పెద్దదైన మధ్య భారతంలో కొన్ని దశాబ్దాలుగా సాగు తున్న వామపక్ష తీవ్రవాదం క్షీణిస్తున్న జాడలు గత కొన్నేళ్లుగా కనబడుతుండగా... మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. అబూజ్‌మఢ్ అడవుల్లో జరిగిన ఆ ఎన్‌కౌంటర్‌లో ఆయనతోపాటు మరో 26 మంది నక్సలైట్లు చనిపోయారని, వారిలో పలువురు కీలక నేతలు ఉండొచ్చని అధికారిక ప్రకటన చెబుతోంది. ఇరుపక్షాల మధ్యా జరిగిన కాల్పుల్లో భద్రతా బలగాల్లోని ఒక జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోగా, మరికొంతమంది గాయపడ్డారని అధికారిక కథనం. ప్రధాన కార్య దర్శి స్థాయి నేత మరణించటం మావోయిస్టు పార్టీకి నిస్సందేహంగా కోలుకోలేని దెబ్బ. అందుకే కావొచ్చు... ఈ ఎన్‌కౌంటర్ గర్వించదగ్గ విజయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం, దోపి%ఎ%¯ నిరోధానికీ ఆయుధం పట్టామని చెబుతున్న మావోయిస్టులు ఇన్ని దశాబ్దాల పోరాటంలో తమ చర్యల పర్యవసానాలనూ, వాటి నిరర్థకతనూ గమనించి సరిచేసుకోలేకపోయారని అర్థమవుతుంది. నక్సలైట్ ఉద్యమం పూర్వాపరాలు గమనిస్తే అదెప్పుడూ పడుతూ లేస్తూనే సాగింది. కానీ తమ పోరాటాలపై రాజ్యం ప్రతిసారీ ఎందుకు పైచేయి సాధించ గలుగుతున్నదన్న అంశంపై వారు దృష్టి పెట్టినట్టు లేదు. అంతకుముందు దేశంలో చెదురుమదురుగా జరిగిన సాయుధ పోరాటాలు అంతరించాయనుకుంటున్న తరుణంలో 1967లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా సిలిగుడి డివిజన్‌లో మారుమూల గ్రామమైన నక్సల్బరీలో రాజు కున్న ఉద్యమం వేగంగా విస్తరించి సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావానికి దారితీసింది. మూడేళ్ల లోపునే పోలీసులు ఆ ఉద్యమాన్ని అణిచేయగలిగారు. దానివెంబడే అప్పటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వెల్లువెత్తిన ఉద్యమం సైతం ఎన్‌కౌంటర్ల పరంపర తర్వాత మూడేళ్లకే సద్దుమణిగింది. తిరిగి మరో ఆరేళ్లకు ఉత్తర తెలంగాణలో తలెత్తి విస్తరించిన ఉద్యమం ఒక్కటే దీర్ఘకాలం సాగిందనుకోవాలి. ఈ మూడు చోట్లా ఒకేవిధంగా మొదట్లో మధ్యతరగతి, మేధావి, విద్యార్థి వర్గాలను ఆకర్షించిన ఉద్యమాలు అనంతర కాలాల్లో ఆ వర్గాలకు ఎందుకు దూరమయ్యాయన్న విశ్లేషణను మావోయిస్టులు చేసుకోలేదని వారి ఆచరణ తీరు గమనిస్తే అర్థమవుతుంది. మరోపక్క నక్సల్ ఉద్యమం చీలికలూ, పేలికలూ అయింది. సీపీఐ (ఎంఎల్) భిన్నవర్గాలుగా విడిపోయింది. లిబరేషన్ వంటి పార్టీలు పార్ల మెంటరీ పంథాకు మళ్లి చెప్పుకోదగ్గ విజయాలు సాధిస్తున్నాయి. పాలకులెవరైనా ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయటానికీ, ప్రభుత్వ విధా నాలు సక్రమంగా లేవనుకుంటే ప్రజల్ని కూడగట్టి ఉద్యమించటానికీ ఎప్పుడూ అవకాశాలుంటాయి. 2014లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక భూసేకరణ చట్టం సవరించినప్పుడూ, అనంతర కాలంలో సాగు చట్టాలు తీసుకొచ్చినప్పుడూ రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.చివరకు కేంద్రం ఆ చర్యల్ని వెనక్కి తీసుకోక తప్పలేదు. మావోయిస్టు పార్టీ వీటిని గమనంలోకి తీసుకుందా? అంతక్రితం 1977 తర్వాత ఉద్యమాల్లోకి ప్రజల్ని కూడగట్టడంలో విజయం సాధించినా అటుపై ఆ ఉద్యమాలకు తోడు సాయుధ చర్యలు కూడా మొదలయ్యాయి. పర్యవసానాలు తెలియని యువ తను మొదట్లో ఇవి ఆకర్షించివుండొచ్చు. కానీ ప్రభుత్వ బలగాలు పకడ్బందీ వ్యూహాలు అమలు చేయటం ప్రారంభించాక ఆ సాయుధ చర్యలు వ్యతిరేక ఫలితాలిస్తాయి.సమస్యలెన్నివున్నా ప్రజలు మౌలికంగా శాంతియుత జీవనాన్ని కోరుకుంటారు. నిత్యం ఉద్రిక్త తల నడుమ అనిశ్చితిలో బతికే స్థితి ఉన్నప్పుడు దాన్నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడటా నికి ప్రయత్నిస్తారు. ప్రభుత్వాలు అణచివేత చర్యలతోపాటు వారి ప్రశాంతతకు హామీ ఇచ్చిన ప్పుడు సహజంగానే ఉద్యమాల వైపు మొగ్గు తగ్గుతుంది. మొదట్లో ఉన్నత చదువులు చదివినవారు భద్రమైన జీవితాన్నీ, బంగారు భవిష్యత్తునూ వదులుకుని ఆ ఉద్యమాల వైపు వెళ్లిన మాట వాస్తవం.అందుకు నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవస్థల్లో పెరిగిన అవినీతి వంటివి కారణం అయ్యాయి. కానీ 1990వ దశకం చివరిలో ప్రపంచీకరణ తర్వాత మన దేశంలో పెట్టుబడులు వెల్లువలా రావటం, యువతకు మెరుగైన అవకాశాలు ఏర్పడటం మొదలయ్యాక ఉద్యమాల పట్ల విముఖత ఏర్పడింది. ఈ తరం విద్యార్థులు అటువైపు వెళ్లటం మాట అటుంచి, వారిలో అత్యధికులకు ఆ ఉద్య మాలపై కనీస అవగాహన కూడా లేదు. మావోయిస్టు ఉద్యమంలో కొత్త రిక్రూట్‌మెంట్ గణనీయంగా తగ్గి పోయిందని గణాంకాలు చెబుతున్నాయి.ఉద్యమంలో మధ్యతరగతి వర్గానికి బదులు ప్రస్తుతం ఆదివాసీల ప్రాబల్యం గతంతో పోలిస్తే పెరిగింది. కానీ దానికి సమాంతరంగా ఆదివాసీలను తమవైపు తిప్పుకోవటంలో భద్రతా బలగాలు సైతం విజయం సాధించగలిగాయి. నంబాల కేశవరావు తదితర ఉద్యమ నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించటం ఆ పర్యవసానమే! వర్తమానంలో విస్తృతంగా అభివృద్ధి చెందిన సాంకేతికత సైతం బలగాలకు అందివచ్చింది.నక్సలిజాన్ని వచ్చే ఏడాది మార్చి ఆఖరుకల్లా అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరచూ చెబుతున్నారు. జరుగుతున్న పరిణామాలు గమనిస్తే అది సాధ్యమేనన్న అభిప్రాయం కలుగుతుంది. ఏదేమైనా ఈ సమస్య హింసకు తావులేకుండా శాంతియుతంగా పరిష్కారమైతే సమాజం సంతోషిస్తుంది. అందుకు మావోయిస్టులు తమ పంథా మార్చుకుని సహకరించాలి. వారు పునరాలోచించుకునేందుకు కేంద్రం కూడా వ్యవధినివ్వాలి.

## కరోనా కొత్త వేరియంట్ అంత భయానకమా..?

# తెలుగు రాష్ట్రాల్లో తొలి కేసు నమోదు!



కరోనా కొత్త వేరియంట్ నిజంగానే అంత భయానకమా..? మళ్లీ క్వారెంటైన్ కష్టాలు తప్పవా..? పరిస్థితి లాక్‌డౌన్‌కు దారితీస్తుందా? అనే భయాల కంటే ముందుగా గుర్తొచ్చేది కొవిడ్ బూస్టర్ వ్యాక్సిన్. కానీ.. బూస్టర్ వెయ్యించుకోవాలా వద్దా అనేది కూడా ఇప్పుడు ప్రపంచ సమస్యగా మారింది. ఔను.. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో గుండెపోటు వచ్చే ఛాన్సుందట. ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని కుదిపేసిన పీడకల కొవిడ్-19.. నేను బతికే ఉన్నా అంటూ అడపాదడపా హెచ్చరిస్తూనే ఉంది. వారం రోజులుగా ఆసియన్ కంట్రీస్‌లో టెర్రర్ పుట్టిస్తోంది. మనదాకా రాలేదుగా అనుకుంటుండగానే భారత్‌లో పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరుగుతూ.. కొవిడ్ భయాన్ని మళ్లీ పరిచయం చేస్తోంది. ప్రస్తుతం మన దేశంలో 250కి పైగా యాక్టివ్ కేసులున్నాయి. కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. గతంలోలాగే ఈ సీజన్‌లో కూడా కొవిడ్ ఫియర్‌లో కేరళ రాష్ట్రమే ముందుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఎటువంటి పరిస్థితికైనా సిద్ధమవ్వాలని అని స్వయానా కేరళ ఆరోగ్య మంత్రే హెచ్చరించారు. పాండిచ్చేరి, ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, సిక్కిం, హర్యానా, కర్ణాటక, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు సైతం అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేశాయి. తెలుగురాష్ట్రాల్ని కూడా ఎలర్ట్ చేసింది కొవిడ్ ఫియర్. పొరుగు రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరగడంతో స్పెషల్ అడ్వైజరీ జారీ చేసింది ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ. వీలైనంతవరకు పార్టీలు, ఫంక్షన్లు, ప్రార్థనలకు దూరంగా ఉండాలి. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ఎయిర్‌పోర్ట్‌ల్లో మాస్క్ వేసుకోవడం భౌతిక దూరం పాటించడం తప్పనిసరి. 60 ఏళ్లు పైబడిన వాళ్లు, గర్భవతులు ఇంట్లోంచి బైటికి రావద్దు. తరచూ చేతులు కడుక్కోవాలి, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలి. అనారోగ్యంగా ఉంటే బైటకు వెళ్లకండి.. అని సూచించింది ఏపీ హెల్త్ డిపార్ట్‌మెంట్. పరీక్షల కోసం ల్యాబ్స్ సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారుల్ని అప్రమత్తం చేసింది కూడా. ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర కోవిడ్ సంబంధిత సమస్యలతో ఇద్దరు మరణించారు. వీళ్లకు మిగతా అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో అప్పట్లో తేలిగ్గా తీసుకున్నాయి ప్రభుత్వాలు. ఇప్పుడు కూడా మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆందోళన పడాల్సిన పనే లేదు. ఎందుకంటే.. ఒక్క హాంకాంగ్‌లోనే 30మందికి పైగా చనిపోయారు. థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ నుంచే కొవిడ్ టెర్రర్ ఉంది. ఒక్క బ్యాంకాక్‌లోనే ఆరువేల కేసులు నమోదయ్యాయి. మన దేశపు జనాభాతో పోలిస్తే ప్రస్తుతమున్న కేసుల సంఖ్య చాలా తక్కువ. అంతమాత్రాన కరోనా ఉనికి లేదని ఊపిరి పీల్చుకోడానికి లేదు. ఎందుకంటే.. టెస్టుల సంఖ్యను బట్టే కేసుల సంఖ్య ఆధారపడి ఉంటుంది. కొవిడ్ సంకేతాలు కనిపించగానే టెస్టుల కోసం క్యూ కట్టే పరిస్థితి ఇంకా మన దేశంలో లేదు. ఇప్పుడు సర్క్యులేషన్‌లో ఉన్న వైరస్.. ఒమిక్రాన్ ఫ్యామిలీలోని జేఎన్1 అనే వేరియంట్ నుంచి వచ్చిన సబ్‌వేరియంట్. ఒరిజినల్ వైరస్‌తో పోలిస్తే, దీని తీవ్రత చాలాచాలా తక్కువ. థర్డ్ వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ వేరియంటే అప్పట్లో పెద్దగా ప్రభావం చూపలేదు. తాజా వేరియంట్‌తో పెద్దగా భయపడాల్సిన అవసరం లేనట్టే..! 100 మందికి వైరస్ సోకితే ఐదుగురు కూడా ఆస్పత్రిలో చేరే అవసరం రాదు. కానీ.. కొవిడ్ ఉనికి తీవ్రతను బట్టి దేశాలన్నీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నదీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్. అందుబాటులో ఉన్నంత మాత్రాన బూత్రాన స్టర్ వ్యాక్సిన్ వేసుకోవచ్చా..? అనేది కొత్తగా పుట్టిన భయం. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ FDA.. కొవిడ్ వ్యాక్సిన్ రెగ్యులేషన్స్‌ని మార్చేసింది. 65 ఏళ్లు పైబడినవాళ్లు మాత్రమే బూస్టర్ షాట్స్ తీసుకోడానికి అర్హులని తేల్చింది. ఇంతకంటే భయపెట్టే విషయం ఏంటంటే.. వ్యాక్సినేషన్ తర్వాత గుండెసంబంధిత వ్యాధులు రావొచ్చని హెచ్చరిస్తోంది FDA. ఈ మేరకు లేబుల్ మీద వార్నింగ్ ఇవ్వాలని వ్యాక్సిన్ తయారీ కంపెనీలను ఆదేశించింది కూడా. సో.. బూస్టర్ వ్యాక్సిన్ వేసుకుందాం.. కొవిడ్ బారిన పడకుండా తప్పించుకుందాం అని ఆశపడితే గుండెపోటుకు దొరికిపోయే ఛాన్సు ఉంది. తస్మాత్ జాగ్రత్త..!

# ప్రపంచం గందరగోళానికి కారణం అమెరికానే.. జైశంకర్ సంచలన వ్యాఖ్యలు!



ప్రపంచం ప్రస్తుతం ఎన్నడూ లేని విధంగా ఒక గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటోందని, దానికి ఓ రకంగా అమెరికానే కారణమని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. యూరప్ మూడు దేశాల పర్యటనలో ఉన్న ఆయన, నెదర్లాండ్స్‌లో మాట్లాడుతూ ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఉగ్రవాదంపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్', పాకిస్తాన్ ఉగ్రవాదం, ఉక్రెయిన్-గాజా యుద్ధాలు, అమెరికా వాణిజ్య యుద్ధం, కాశ్మీర్ సమస్య వంటి అనేక కీలక అంశాలపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టం చేశారు. ప్రపంచం బహుళ ధ్రువాలుగా మారుతుందని ఆసియా ఎదుగుదలపై ఆయన ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. పొలిటికెన్‌కు ఇచ్చిన ఒక ముఖ్యమైన ఇంటర్వ్యూలో, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ డెన్మార్క్‌పై తన ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచం ప్రస్తుతం ఒక అస్తవ్యస్తమైన దశ గుండా వెళుతోందని, ప్రపంచవ్యాప్తంగా అస్థిరత నెలకొందని అన్నారు. గాజా, ఉక్రెయిన్‌లో విధ్వంసకర యుద్ధాలు జరుగుతున్నాయి. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించింది. చైనా తైవాన్‌ను బెదిరిస్తోంది. అదే సమయంలో భారతదేశం, పాకిస్తాన్ తీవ్రమైన సైనిక సంఘర్షణ తర్వాత ఉత్కంఠగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అన్ని పరిణామాల తర్వాత కూడా ప్రపంచం మళ్లీ సమతుల్యం అవుతోందని జైశంకర్ అన్నారు. ప్రపంచం పాశ్చాత్య దేశాల ప్రభావం నుంచి బయటపడుతూ మరింత వైవిధ్యంగా, మరింత ప్రపంచీకరణ చెందుతూ చాలా వరకు మరింత ఆసియా ప్రాబల్యం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మరో కార్యక్రమంలో "పాకిస్తాన్ ఉగ్రవాదానికి కేంద్రం అని మీరు గతంలో కూడా అన్నారు. అక్కడ ఉన్న ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ప్రభుత్వం మద్దతు ఇస్తోందని అన్నారు. ఇప్పుడు కూడా అదే మాటపై నిలబడతారా?" అని మంత్రి జైశంకర్ కు ఓ ప్రశ్న ఎదురైంది. ఈ ప్రశ్నకు జైశంకర్ స్పందిస్తూ.. "అవును, నేను ఇదివరకే చెప్పాను, ఇప్పుడు చెబుతున్నాను" అని స్పష్టం చేశారు. ఆయన ఉదాహరణలతో వివరంచారు. జైశంకర్ తన ప్రసంగంలో భారత్ ఉగ్రవాదంపై చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' గురించి కూడా ప్రస్తావించారు. ఇది భారతదేశం తన భద్రత విషయంలో ఎంత కట్టుబడి ఉందో స్పష్టం చేస్తుందని అన్నారు. కాశ్మీర్ అంశంపై కూడా ఆయన భారత్ వైఖరిని పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ సంబంధాలలో ముఖ్యంగా ఆసియా ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదగడం ప్రపంచ భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తుందో ఆయన వివరించారు. ఈ సంక్లిష్ట ప్రపంచ పరిస్థితుల్లో భారతదేశం ఒక కీలకమైన, బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.

# ఉగ్రవాదానికి తలవంచని భారత్



ఉగ్రవాదం అనే పదం ఊహాజనిత భయం కాదు. దేశాన్ని భయకంపితమయ్యేలా చేయాలన్న కుయుక్తి. ఇది టీవీ డిబేట్లలో మాట్లాడుకునే రాజకీయ సమస్య కాదు. ఇది నిత్యం మన సరిహద్దుల్లో, నగరాల్లో, నిశ్శబ్దంగా విరుచుకుపడే ఉగ్ర పీడ. 1985 నుంచి నేటి వరకు జరుగుతూ వచ్చిన వరుస ఉగ్రదాడులు ఈ దేశాన్ని కల్లోలంలో ముంచెత్తాయి.. కానీ మనం తలవంచలేదు. తలెత్తుకుని నిలబడ్డాం. దేశంలో అశాంతి చేలరేగేలా చేసేవారి కుట్రలు ప్రతిసారీ విఫలమవుతూనే ఉన్నాయి. అట్లాంటిక్ గగనతలంలో 1985లో జరిగిన 'ఎయిర్ ఇండియా కనిష్క్' పేలుడు నుంచి.. మొన్నటికి మొన్న బైసరాన్ వ్యాలీలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి వరకు, ఈ దేశం ఎన్నో చీకటి దుర్మార్గాలను చూసింది, తట్టుకుంది. భారత దేశంపై ఉగ్రదాడులు యాదృచ్ఛికంగా జరగలేదు. అవి సంస్థాగతంగా, సుదీర్ఘంగా ప్రణాళికాబద్ధంగా జరిగాయి. 1991లో రాజీవ్ గాంధీ హత్య, 1993 ముంబయి పేలుళ్లు, 2001లో పార్లమెంటుపై దాడి, 2008లో ముంబయి 26/11 ఉగ్ర హత్యలు, ప్రతి దాడి మన దేశ మనోబలాన్ని పరీక్షించాయి. కానీ మనం తలవంచలేదు. తలెత్తుకుని నిలబడ్డాం.

### ప్రతి ఒక్క దాడి తర్వాత..

2016 ఉరీ దాడి, 2019 పుల్వామా ఘటనలు దేశవ్యాప్తంగా కల్లోలాన్ని కలిగించాయి. కానీ మనదేశం వెంటనే స్పందించి పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా దేశ శక్తిని మాత్రమే కాదు, నైతిక పటిష్టతను కూడా ప్రపంచానికి చాటింది. తాజాగా గత నెల 22న మరో ఘోర దుర్ఘటన పహెల్గాం వద్ద బైసరాన్ వ్యాలీలో ఉగ్రదాడి చరిత్రలో నిలిచిపోయే ఓ మానవీయ విషాదం. ఈ ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు చనిపోయారు. అయినప్పటికీ, మన దేశ సంకల్పాన్ని ఇవి దెబ్బతీయలేకపోయాయి. వారు చేసిన దాడి తర్వాత మన 'ఆపరేషన్ సిందూర్' ప్రతిదాడి తీవ్రత ఎక్కువగానే ఉంది. పహెల్గాం దాడికి సంబంధించిన ఆ ఉగ్రవాదులను మనం పట్టుకోలేకపోయినా, పాక్ ఉగ్ర స్థావరాలపై మన బలగాలు జరిపిన ప్రతీకార చర్య ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు మహిళల నేతృత్వంలో జరిగిన ఈ వ్యూహాత్మక దాడి, భారత సైనిక సామర్థ్యాన్ని మాత్రమే కాదు, భారత మహిళా శక్తిని కూడా చాటింది. ఈ దాడికి దేశమంతా ఐక్యంగా ప్రభుత్వానికి మద్దతు పలికింది. పార్టీలకతీతంగా విపక్ష నేతలంతా కేంద్ర ప్రభుత్వానికి వెన్ను దన్నుగా నిలిచారు. దౌత్య ఫలితంగా అంతర్జాతీయంగా మనకు మద్దతు లభించింది.

### ఉగ్రవాదానికి మతం ఉండదు!

భయం ముందు తలవంచని మన శక్తే దేశానికి నిజమైన రక్షణ కవచం. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలు వ్యర్థం కావు. వాళ్ల తుది నిశ్వాసలో మన భద్రత ఉంది. మన శ్వాసల్లో వాళ్ల ఆశయం ఉంది. ప్రతి భారతీయుడి చేతిలో తుపాకీ లేకపోయినా, మన కర్తవ్యంలో జాగృతంగా ఉండే ప్రతి క్షణం ఉగ్రవాదాన్ని ఎదిరించే ముందడుగు. దాన్ని మౌనంగా అంగీకరించడం కాదు, ఖండించడం అవసరం. ప్రతిసారీ మనం చుట్టూ జరుగుతున్న అసహనాన్ని, విద్వేషాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంటుంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అంటే, అది విలువల కోసం జరిగే పోరాటం. శాంతిని, మానవతను, సహజీవనాన్ని ప్రతిష్ఠించే ఈ పోరాటంలో మన ప్రతి ఆలోచన, ప్రతి చర్య కూడా ఆయుధమే. మన పాఠశాలల బోధనలో, కుటుంబాల సంస్కారాల్లో, రాజకీయ చైతన్యంలో ఈ విషయం చెప్పాలి. మతాన్ని, భాషను, వర్గాన్ని ఆయుధంగా వాడే కుట్రలకు మనం బలి కాకూడదు. నిజానికి ఉగ్రవాదానికి మతం ఉండదు. మాలేగావ్, మక్కా మసీదు, అజ్మీర్ దర్గా, సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ల్లో జరిగిన అమానవీయ దాడులే దీనికి నిదర్శనం. అజ్మల్ కసబ్ అయినా, అసిమానంద స్వామి అయినా, ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అయినా అజర్ మసూద్ అయినా ఇలాంటి భావజాలం కలిగిన వారందరూ ఒకే తాను ముక్కలు, మతోన్మాద, ఉగ్రవాదులు.. మానవత్వానికి వ్యతిరేకమైన హింసా ప్రవృత్తికి ఉదాహరణలు..

### ఆలోచనలతోనే మార్పు సాధ్యం!

ఈ దేశ సమగ్రతను కాపాడడానికి ఇటువంటి అన్ని రకాల, అన్ని రూపాల ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యం మనకు అవసరం. అది మాత్రమే నిజమైన జాతీయత. మతం, భాష, జాతి పేరుతో భయాన్ని వ్యాపింపజేసే వారు ఎవరైనా వారిని వ్యతిరేకించాలి. రాజకీయ నాయకులు ప్రజల్లో అసహనాన్ని రెచ్చగొట్టే మాటలకు బదులుగా, సమాజాన్ని కలుపుకుపోయే సంస్కారాన్ని పెంపొందించాలి. శాంతి అనేది ఆయుధాలతో కాదు, ఆలోచనల మార్పుతో సాధ్యమవుతుంది. అందుకే మానవతా విలువలతోనే ఉగ్రవాదాన్ని ఓడించాలి. ఉగ్రవాదం మన దేశాన్ని ఎప్పటికీ కదిలించలేదు. అటువంటి విధ్వంసక శక్తులతో పోరాడి ఓడించే శక్తి మన దేశానికి ఉంది. ఇంకోసారి ఉగ్రవాదాడి జరిగితే భారత్ ఎప్పటికీ తలవంచదని చూపించాలి.

## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు




న్యూఢిల్లీ : కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారని సుప్రీంకోర్టు శుక్రవారం రాజస్తాన్ ప్రభుత్వాన్ని నిలదీసింది. పరిస్థితి తీవ్రమైనదని పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటివరకు కోటాలో 14 ఆత్మహత్య కేసులు నమోదయ్యాయని, అక్కడే ఎందుకు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని జస్టిస్ జె.బి.పార్థివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. "రాష్ట్రప్రభుత్వంగా మీరు ఏంచేస్తున్నారు, ఎలాంటి చర్యలు తీసుకున్నారు. కోటాలో మాత్రమే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు" అని ప్రశ్నించింది. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు రాష్ట్రంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని ఏర్పాటు చేశామని ప్రభుత్వం తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఖరగ్‌పూర్‌లోని ఐఐటిలో చదవుతున్న 22ఏళ్ల విద్యార్థి మృతిపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. మే 4న ఘటన జరగగా, మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, నాలుగు రోజులు ఎందుకు తీసుకున్నారని సంబంధిత పోలీస్ అధికారులను ప్రశ్నించింది. చట్ట ప్రకారం దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. ఆత్మహత్య గురించి తెలుసుకున్న తర్వాత ఐఐటి ఖరగ్‌పూర్ అధికారులు పోలీసులను అప్రమత్తం చేసినట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఖరగ్‌పూర్ న్యాయవాది మరియు పోలీస్ అధికారుల వివరణలతో ధర్మాసనం ఏకీభవించలేదు. "మీరు మా తీర్పుని ధిక్కరిస్తున్నారు. మీరు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు" అని రాజస్తాన్ తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. కోటాలో నీట్ అభ్యర్థి తన తల్లిదండ్రులతో కలిసి నివసించిన గదిలోనే చనిపోయి కనిపించిన మరో కేసు గురించి కూడా ధర్మాసనం ప్రశ్నించింది. పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి తన విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించలేదని ధర్మాసనం పేర్కొంది. పరిస్థితిని వివరించాల్సిందిగా ఆ పోలీస్ అధికారికి సమన్లు జారీ చేసింది.

## నవంబర్ 1 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ




తిరువనంతపురం : ఈ ఏడాది నవంబర్ 1 నాటికి కేరళ పేదరిక రహిత రాష్ట్రంగా మారుతుందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. తిరువనంతపురంలో శుక్రవారం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నాలుగవ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ.. దేశంలోనే కేరళ అత్యల్ప పేదరిక స్థాయిని కలిగి ఉందని అన్నారు. బలమైన మరియు సమర్థవంతమైన ప్రజా పంపిణీ వ్యవస్థతో ఇది సాధించగలిగామని, ఈ అభివృద్ధిని గత కొన్ని సంవత్సరాలుగా తమ ప్రభుత్వం స్థిరంగా బలోపేతం చేస్తోందని అన్నారు. భవిష్యత్ దృష్ట్యా ప్రజా భాగస్వామ్య విధానాలను పారిశ్రామిక వ్యూహాలతో మిళితం చేయడం ద్వారా కేరళ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం కేరళ అని, నవంబర్ 1 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా మారుతుందని ఉద్ఘాటించారు. 2016లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టిన సమయంలో ..రాష్ట్రంలో పెట్టుబడి పరిస్థితులను మార్చడం ఆందోళన కలిగించే కీలకాంశాల్లో ఒకటిగా ఉందని గుర్తు చేసుకున్నారు. ఆందోళనలు తొలగించేలా పారిశ్రామిక వేత్తలు, వాటాదారులతో తమ ప్రభుత్వం వివరణాత్మక చర్చలు జరిపిందని, పథకాల రూపకల్పనలో వారి అభిప్రాయాలను కూడా చేర్చామని అన్నారు. ఫలితంగా రాష్ట్రంలో వ్యాపారాలను సులభతరం చేసేందుకు అనువుగా చట్టాలను, నిబంధనలను సవరించామని, అనేక నిర్మాణాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టామని అన్నారు. పథకాల్లో మార్పులతో పాటు పారిశ్రామికీకరణకు అనుగుణంగా సామాజిక దృక్పథాన్ని కూడా మార్చాల్సిన అవసరాన్ని గుర్తించామని, అందుకే కేరళలో 'ఇయర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' ను ప్రారంభించామని అన్నారు. ఈ నమూనాను కేంద్ర ప్రభుత్వం జాతీయ నమూనాగా గుర్తించిందని విజయన్ పేర్కొన్నారు. పన్ను ఆదాయ పంపిణీలో రాష్ట్రానికి లభించాల్సిన హక్కును కేంద్రం నిరాకరించిందని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన పన్ను వాటాను న్యాయంగా కేంద్ర ప్రభుత్వం కేటాయించి వుంటే, 2022-23లో వరుసగా 2,282కోట్లు, 2023-24లో రూ.2.071 కోట్లు అదనంగా వచ్చేవని అన్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో , దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల మొత్తం పన్ను ఆదాయంలో కేరళ వాటా 3.7శాతమని అన్నారు. ఇదే సమయంలో కేంద్రం నుండి కేరళకు వచ్చిన పన్ను వాటా వరుసగా 1.53 శాతం మరియు 1.13 శాతం మాత్రమేనని అన్నారు. కేరళ జనాభా ఆధారంగా రాష్ట్రానికి 2.7శాతం వాటా రావాల్సి వుందని, ఇది అదనపు డిమాండ్ కాదని, కేరళకు రావాల్సిన నిజమైన వాటా అని

## ఢిల్లీలో వర్షాలు కొంకణ్‌కు రెడ్ అలర్ట్ : ఐఎండి



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. అక్కడ మరో రెండురోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడి భారీ వర్షం పడే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త అఖిల్ శ్రీవాస్తవ మీడియాకు వెల్లడించారు. అలాగే దక్షిణ కొంకణ్ - గోవా తీరానికి దూసుకెళ్లి తూర్పు - మధ్య అరేబియా సముద్రంపై అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. ఇది ఉత్తరవైపుకు కదిలి రాబోయే 36 గంటల్లో మరింత తీవ్రమై వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ అల్పపీడనం వల్ల రాబోయే మూడురోజులపాటు కొంకణ్ ప్రాంతంలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

## బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్



సంగారెడ్డి: జహీరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లో పర్యటించిన సీఎం.. హుగ్గెల్లి జంక్షన్‌లో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాచునూరులో కేంద్రీయ విద్యాలయం భవనాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్ చేరుకున్న సీఎం.. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణంలో రూ.494.67 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2014 తర్వాత నిమ్జ్ అభివృద్ధి కుంటుపడిందని.. భూసేకరణలో అన్యాయం జరిగిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నిమ్జ్‌కు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం పెంచామని చెప్పారు. నిమ్జ్ కోసం భూములిచ్చిన వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. త్వరలోనే 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. నేషనల్ హైవేపై అండర్ పాస్ నిర్మాణాలు చేస్తాం. సింగూరు ప్రాజెక్టును అద్భుతమైన టూరిజంగా తీర్చిదిద్దుతాం. హుండాయ్ కార్ల పరిశ్రమ ఏర్పాటు కాబోతుందని రేవంత్ అన్నారు. జహీరాబాద్ అభివృద్ధి సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తామని.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏకో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ చెప్పారు.


# 'సాగు' సజావుగా సాగేనా?



ఈ ఏడాది నైరుతీ పవనాలు కేరళ తీరాన్ని సాధారణం కంటే ఐదు రోజుల ముందే తాకబోతున్నట్టు భారత వాతా వరణ శాఖ(ఐఎండీ) ప్రకటించింది. జూన్ ఒకటిన రావాల్సిన పవనాలు ఈ నెల 27నే తీరాన్ని తాకనున్నట్టు ప్రకటించింది. తెలంగాణలో జూన్ మొదటివారంలోనే తొలకరి వర్షాలు పడతాయని ముందస్తు శుభవార్త అందించింది. ఈ సారి వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ మోసుకొచ్చిన చల్లని కబురు అన్నదాతల్లో ఆశలు చిగురింప జేసింది. గతేడాది అకాల వర్షాలు, నాసిరకం, కల్తీ విత్తనాలు, పంటలకు ధరలేమి ఇత్యాది సమస్యలన్నీ కట్ట కట్టుకొని రైతులకు నష్టాలు మూటగట్టాయి. అప్పుల భారంతో ఎంతోమంది అన్నదాతలు తనువు చాలించారు. యాసంగి చివరిలోనూ అకాల వర్షాలు కన్నీరు పెట్టించాయి.కొద్దిరోజులుగా ఎక్కడో చోట ఏదోమూల అకాల వర్షాలు పడుతూ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనకంతంటికీ వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు ఒక బాగమైతే, పంటల కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం కూడా చాలా స్పష్టంగా కనిపించింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వ్యవసా యాన్ని నమ్ముకున్న రైతు వాటన్నంటినీ తట్టుకుని ముందుకు సాగుతున్నాడు. ఈమారైనా 'కాలం' కలిసి వస్తుందని రైతులు రాబోవు వానాకాలం పంటపై ఆశలు పెట్టుకున్నారు. అందుకే విత్తనాలు జల్లేందుకు పంట పొలాలను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. గతం పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం రుణాల మంజూరు, విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుని రైతులకు సకాలంలో అందించేందుకు ఏర్పాట్లు చేయాలి. సాంకేతిక కారణాలతో రెండు లక్షల రుణమాఫీ సమస్య పూర్తికాలేదు. దాదాపు పద్దెనిమిది లక్షల మంది ఎదురుచూస్తున్నారు. రైతు భరోసా సాయంపై అనుమానాలు అలానే ఉన్నాయి. విత్తనాలు, ఎరువులు కోసం ఎక్కడికి పోవాలన్నది ప్రశ్న. సర్కారులో అలాంటి సన్నద్ధత ఉందా? వానాకాలం సాగు కోసం రాష్ట్రంలో కోటి 34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవ సాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. రేషన్‌దుకాణాల్లో సన్న బియ్యం అందించడం, రూ.500 బోనస్ అందించడం వల్ల సన్నరకాలకే రైతులు మొగ్గు చూపే అవకాశం ఉంది. దీంతో అత్యధికంగా వరి 66.80 లక్షల ఎకరాల్లో సాగు కానుంది. పత్తి 50 లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నట్టు తెలిపింది. ఆ తర్వాత మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న, సోయా బీన్, మినుములు, కంది, ఇతర ఉద్యానవన పంటలు వేయనున్నారు. సాగుకు తగినట్టుగా 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు, 95 లక్షల పత్తి ప్యాకెట్లు, 1.35 లక్షల క్వింటాళ్ల సోయా చిక్కుడు, తదితర పంటల విత్తనాలు అవసరమని భావించింది. విత్తన పంపిణీలో మాటలు ప్రతి ఏడాదీ కోటలు దాటుతున్నా, చేతలే గడప దాటట్లేదు. గతంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విత్తనాల పంపిణీ జరిగేది. ఇప్పుడు ప్రయివేటు కంపెనీల నుంచే ఎక్కువభాగం అందుతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల సమీక్షలు ఎలా ఉన్నా సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరు వులు అందవు. క్యూలో నిలబడలేక రైతులు చెప్పులు పెట్టా ల్సిన పరిస్థితులు చూశాం. విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పుకుంటున్నా నాసిరకం విత్తనాలను కొనుగోలు చేయా ల్సిన అగత్యం ఏర్పడుతోంది. దీన్ని అనువుగా చూసుకుని ప్రయివేటు వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటకట్టడం వల్ల వేలాది రూపాయలు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. నకిలీ విత్తనాలు కొని సాగుచేయడం వల్ల ఆ మొక్కలు తిని పశువులు చనిపోయిన ఘటన ము లుగు జిల్లాలో తాజాగా వెలుగుచూసింది. కర్నాటక, మహా రాష్ట్ర, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాష్ట్రంలో అడుగు పెడుతున్నాయి. అమ్మేవారిపై తప్ప నకిలీ విత్తనాలు తయారు చేస్తున్నవారిపై చర్యలు ఉండవు. ఈ విష యంలో కేంద్రం కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఏ భూమిలో ఏయే పంటలు సాగు యోగ్యమో రైతులకు వ్యవసాయశాఖ అవగాహన కల్పించాలి. ఏప్రిల్‌లోనే పరీక్షలు జరిపి మే నెలాఖరు నాటికి కార్డులు జారీ చేయాలని ఏండ్ల తరబడి అనుకుంటున్నా ముందుకు సాగడం లేదు. రైతు మహోత్సవాల పేరిట ఇటీవల సదస్సులు నిర్వ హించినా ఉపన్యాసాలకే పరిమిత మయ్యాయి. దీనివల్ల రైతుకు అవగాహన కాలేదు. రైతు చేతిలో భూసార కార్డు ఉంటే తన పొలంలో ఏపంట వేసుకోవాలి. ఎలాంటి ఎరువులను వాడా లన్నది తెలుసుకునే వాడు. పంటలు నష్టపోయిన రైతులు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీల కోసం నిరీక్షిస్తు న్నారు. ఇటీవల అకాల వర్షాలతో వెయ్యికోట్లకు ృటగా నష్టం వాటిల్లినా, వాటికి ఇంతవరకూ నష్ట పరిహారం అందించిన దాఖలాల్లేవు.ఖరీఫ్ ప్రారం భ వేళ రైతులను ముసురుకుంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలి.సాగునీటి విడుదల విషయమై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. ఉత్తుత్తి మాటలు శుష్క వాగ్దానాలతో సమయాన్ని వృథా చేయకుండా సాగు సజావుగా సాగేందుకు సర్కార్ అవసరమైన అన్ని చర్యలూ యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

## సిబిల్ స్కోర్ దరఖాస్తుదారులను గుబులు






కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' ఆశావహ నిరుద్యోగులకు అందుతుందా లేదా అన్న గందరగోళం నెలకొంది.యువతకు ఆర్థిక చేయూత అందించేందుకంటూ తెచ్చిన ఈ పథకం యువతను తిప్పలు పెడుతున్నది.బ్యాంకు సిబిల్ స్కోర్ దరఖాస్తుదారులను గుబులు పెడుతున్నది. ప్రభుత్వం కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడమేగాక, రేషన్‌కార్డు ఉంటేనే పథకానికి అర్హత వంటి నింబంధనలు పెట్టింది. గత సర్కార్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం చేసుకున్న దరఖాస్తులు ఇప్పుడు మెడకు గుదిబండలా మారాయి. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులో ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే 'అల్రెడీ అప్లైడ్' అని చూపుతున్నది. ఇక వికలాంగుల సంగతి సరేసరి. ఈ ఆటంకాలన్నింటిని దాటుకొని యాభై లక్షల మంది నిరుద్యోగులకు గాను 16.23 లక్షల దరఖాస్తు వచ్చాయి. ఇప్పుడు వీరిని సిబిల్ నిబంధనలు పరేషాన్ చేస్తున్నాయి. వాస్తవానికి నిరుద్యోగులు రూపాయి ఆదాయం లేకనే ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. దమ్మిడి ఆదాయం లేని యువకులకు బ్యాంకుల్లో అకౌంట్లు ఎక్కడివి? ఉన్నా అవి పైచదువుల కోసం సర్కార్ ఇచ్చే స్కాలర్ షిప్‌ల కోసం తెరిచినవే కానీ వాటిలో పెద్దగా లావా దేవీలు ఉండవు. ప్రభుత్వం ఇచ్చే కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు, చిరు వ్యాపారులకు ఇప్పుడు బ్యాంకర్ల సిబిల్ స్కోరు తనిఖీ పెద్ద ఆటంకంగా మారుతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు సిబిల్ స్కోరు బావుంటేనే లోన్లు లభిస్తాయనడం ఎంత వరకు సబవు? ఈ నిబంధన యువతకు ప్రతిబంధకంగా మారుతున్నది. ఎన్నో ఆశలతో సబ్సిడీ రుణాలు పొంది జీవితంలో సెటిల్ అవుదామనుకుంటున్న నిరుద్యోగుల ఆశలపై సిబిల్ స్కోరు నీళ్లు చల్లుతున్నది. బ్యాంకర్లు గుడ్, బ్యాడ్, ఎక్సలెంట్, యావరేజ్ అంటూ సిబిల్ స్కోరు నిర్ణయిస్తున్నారు. ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంక్ అకౌంట్లు, ఫోన్ నెంబర్లు కేవైసీ చేసి వాటి ద్వారా నిరు ద్యోగుల, చిరు వ్యాపారుల సిబిల్ స్కోరు ర్యాంకులను నిర్ణయిస్తారు. క్రెడిట్ కార్డు వాడేవారికి, పెద్ద వ్యాపారులకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు దీనిపై పూర్తి స్థాయి అవగాహన ఉంటుంది. స్కోరు పడిపోకుండా వారు డబ్బులను రొటేషన్ చేస్తుంటారు. కొత్తగా బ్యాంక్ అకౌంట్ తెరిచిన వారికి మైనస్ ఒకటి ర్యాంకింగ్ ఇచ్చి చిన్నపాటి రుణం మాత్రం ఇస్తారు. ఇకపోతే ఫోన్ యాప్‌ల్లో లోన్లు తీసుకున్నవారికి, క్రెడిట్‌కార్డు లోన్లు ఉన్నవారికి సిబిల్ స్కోరు తక్కువ గానే ఉంటుంది. రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసిన వారికి ఆదాయం ఉండదు. ఆ ఆదాయ మార్గాలు, ఉపాధి మెరుగు పర్చుకునేందుకే ఈ లోన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ పథకం కింద వివిధ కార్పొరేషన్ల ద్వారా రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు వ్యక్తిగత రాయితీ రుణాలిచ్చి వారికి అండగా నిలబడతామని ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మే నిరుద్యోగ యువత సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిని సిబిల్ పేరుతో వంచనకు గురి చేయడం ఈ ప్రభుత్వానికి తగునా? నిరుద్యోగులకు వరంగా రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి అమల్లోకి రానుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇదంతా బాగానే ఉన్నా యువ వికాసం రుణాలు రావాలంటే తప్పనిసరిగా బ్యాంకు సిబిల్ స్కోర్ 700 దాటితేనే రుణాలకు అర్హులని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని అధికారులు అంటు న్నారు. కానీ, ఇదంతా కేవలం సోషల్ మీడియా ప్రచారం మాత్రమే తప్ప వాస్తవం కాదని, లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్‌కు సంబంధం లేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన చేసినప్పటికీ.. ఈ ప్రచా రం మాత్రం ఆగటం లేదు. ఇటు ప్రభుత్వ మాటలకు అటు అధికారుల చేతలకు పొంతన లేక నిజమైన లబ్దిదారులకు న్యాయం జరుగుతుందా అన్న అనుమానాలు చెక్కర్లు కొడుతున్నాయి. దీంతో దరఖాస్తు దారులు అయోమయానికి గురవు తున్నారు. మరోవైపు లబ్ధిదారుల జాబితాల వెల్లడికి సమయం దగ్గర పడుతున్నది. జూన్ 2న మంజూరు పత్రాలను అందజేస్తారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన ఉంటుందా? దరఖాస్తు దారుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుం టుందా? అనేది ఉత్కంఠగా మారింది! కాబట్టి ఈ గందరగోళానికి తెరదించి యువతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

# 'నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది'




'నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది' ఇది ఎప్పటిదో నానుడి. నోరు మంచిదవటం అటుంచి కంపుగా, మూర?ంగా మారితే ఎంత దుర్మార్గంగా తయారవుతుందో విజరుషా, జగదీశ్ దేవడా ఇంకా మరికొన్ని నోళ్లు బహిరంగంగా నిరూపిస్తున్నాయి. గత పదకొం డేండ్ల నుండి ఇలాంటి వాళ్ల నోటి నుండి వస్తున్న కంపును భరించలేక చస్తున్నాం. ఇవేవో వ్యక్తిగతమేకాదు, వ్యవస్థాపరమైన, సమాజం మొత్తానికి వర్తించే విచ్ఛిన్న భావజాలపు కల్మషాలకు వ్యక్తం చేస్తు న్నాయి. వ్యవస్థలనే అవమానపరచే దుష్ట ధ్వనులివి. నోళ్లు నిండిన మాటలు, కేవలం నోళ్లలోంచేరావు. అవన్నీ వాళ్ల మనసు బురదల్లో పుట్టిన ఆలోచనలే. మూర?త్వం మూర్తీభవించిన వారి అభివ్యక్తులు అవి. ఈ నోళ్లను కట్టడి చేయకపోతే వాతావరణ మంతా దుర్గం ధాన్ని వెదజల్లుతూనే ఉంటుంది. పెహల్గాం దాడి తర్వాత మన భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు సైన్యం చేపట్టిన సిందూర్ ఆపరేషన్ విజయవంతం అయినందుకు, దేశంలోని ప్రజలందరూ, ప్రతిపక్షాలూ, దేశ వాసులందరూ ప్రభుత్వానికి, సైన్యానికి సంపూర్ణ మద్దతును అందించారు. తరతమ భేదాలన్నీ మరచి వెన్నంటి ఉన్నారు. ఇలాంటి ఐక్యత అవసరమైన వేళ విచ్ఛిన్న ప్రకటనలు, అవమాన పరిచే ఉక్తులు, అధికారపు హోదాలు వెలగపెడుతున్నవారి నుండి రావటం క్షమించరాని నేరమే అవుతుంది. ఆపరేషన్ సిందూర్‌లో ప్రముఖపాత్ర పోషించిన కల్నల్ సోఫియా ఖురేషీ, అందుకు సంబంధించిన వివరాలను దేశానికి సగర్వంగా వివరించి తెలిపింది. అట్లాంటి ఒక వీరవనితపై మధ్యప్రదేశ్ ప్రభుత్వంలోని మంత్రి, బీజేపీ నాయకుడు విజరుషా దుర్మార్గమైన వ్యాఖ్య చేశాడు. సోఫియా ఖురేషీ 'ఆమె ఉగ్రవాదుల సోదరి' ఆమెతోనే ఉగ్రవాదులను మట్టుపెట్టించారు మన ప్రధాని అని వ్యాఖ్యానించాడు. ఉగ్రవాదుల సోదరి అని ఎందుకన్నాడంటే, ఉగ్ర వాదులు ముస్లిం మతస్తులు కావున మన కల్నల్ ఖురేషి ముస్లిం కావడం, ఆయన ఆలోచనలు మతపరంగానే విశ్లేషించాయి. ఇది చాలా తీవ్రమయిన వ్యాఖ్య. మన సైన్యంలో అనేకమంది అనేక మతాలకు, ప్రాంతాలకు సంబంధించిన వారు తమ సేవలను అందిస్తున్నారు. అంతేకాదు, త్యాగాలను చేస్తున్నారు. భారతదేశం లౌకికదేశమని స్వయానా ఖురేషీ వెల్లడించింది. పెహల్గాంలో తీవ్ర వాదులు మతం పేరు అడిగి చంపారంటున్నారు. మన మంత్రులూ మతాన్ని ఆధారం చేసుకునే మాట్లాడుతున్నారు. ఇది ఖురేషీ సేవను, సాహసాన్ని, నిబద్ధతను అవమానించే వ్యాఖ్య. ముప్పయి ఏండ్ల నుండి సేవ చేస్తూ ఎన్నో ప్రశంసలను పొందిన కల్నల్ ఆమె. ఆమే కాదు, ఆమె తాత, తండ్రి అందరూ దేశం కోసం సైన్యంలో పనిచేసినవారే. 'మాకు ముందు దేశం, ఆ తర్వాతే మతం' అని ప్రకటించిన వారు కూడా. విజరుషా వ్యాఖ్య తీవ్రమైందిగా భావించి హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కేసు నమోదు కాగా దానిపై స్టే ఇవ్వాలని సుప్రీంకు వెళ్లగా సుప్రీంకోర్టు నిరాకరించి, కల్నల్‌కు క్షమాపణ చెప్పాలని హెచ్చరించింది. ఇవన్నీ జరుగుతున్నా ఇంతవరకు, అక్కడి ప్రభుత్వం కానీ, బీజేపీ నాయకత్వంకానీ అతనిపై ఏ చర్యా తీసు కోలేదు. ప్రధాని కూడా మాట్లాడలేదు. సోఫియా కుటుంబ సభ్యులు సైతం ఆ రకమైన వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధాని, రక్షణ మంత్రి, హోం మంత్రులకు విజ్ఞప్తి చేశారు. మతం ఆధారంగానే మనుషులను చూడటం మాట్లాడటమనేది రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్నవారు చేయవచ్చా! ఇదిలావుంటే సైనికులకు చేతులెత్తి సలాం చేయాల్సిన వేళలో ఆపరేషన్ సిందూర్ సందర్భంగా యావత్ సైన్యం ప్రధాని మోడీ పాదాలకు ప్రణమిల్లిందని, మన సైన్య పరాక్రమాన్ని అవమానిం చాడు మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీశ్ దేవ్డా. తక్షణమే క్షమా పణలు చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. అంతేకాదు, కాల్పుల విరమణ ఒప్పందాన్ని మీడియాకు తెలియచేసిన విదేశీ వ్యవహారాల కార్యదర్శి, విక్రమ్ మిస్రీపైన మూర? శిఖామణులు ట్రోలింగ్‌కు తెగబడ్డారు. కాల్పుల విరమణ అనేది ప్రభుత్వాల మధ్య జరిగేదన్న ఇంగిత జ్ఞానం వీళ్లకు లేకపోయింది. అంతకుముందు పెహల్గాంలో భర్తను కోల్పోయిన హిమాన్షుపై కూడా దుర్మార్గమైన ట్రోలింగ్ జరి గింది. ఈ మూర?పు వ్యాఖ్యలు, ట్రోలింగ్స్ అన్నీ దేశభక్తులమని చెప్పు కునే సంఘ పరివార్ శక్తుల నుండే వస్తున్న విషయాన్ని గమనించాలి. ప్రభుత్వాలు ఇప్పటికయినా ఈ నోళ్లను మూయించాలి! దేశ సమైక్యతను దెబ్బతీసే వారిని శిక్షించాలి.

